aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTV NETWORK

www.mahaaprabha.com

నమస్తే
మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

శనివారం
3-10-2026
సంపుటి : 01 సంచిక :192 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com



44 ఏళ్ల నిరీక్షణకు తెర

- ఫైనల్లో చైనాపై భారత్ 1-0తో ఉత్కంఠ విజయం
- ఆసియా క్రీడల్లో రెండోసారి పసిడి పతకం
- 1982 తర్వాత మళ్లీ స్వర్ణం సాధించిన భారత జట్టు
- లాల్రెమ్సియామి కీలక గోల్‌తో భారత్‌కు ఆధిక్యం
- గోల్‌కీపర్ సవితా పునియా అద్భుత ప్రదర్శన
- చైనా దాడులను సమర్థంగా అడ్డుకున్న భారత రక్షణ
- 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత
- భారత్ ఖాతాలో 16వ స్వర్ణ పతకం

మహిళల హాకీకి స్వర్ణం

ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టు చరిత్ర సృష్టించింది. ఫైనల్లో చైనాపై 1-0 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్నికైవసం చేసుకుంది. దీంతో 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ మహిళల హాకీలో పసిడి సాధించింది. ఫైనల్లో భారత గోల్‌కీపర్ సవితా పునియా కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయానికి దోహదపడింది. ఈ విజయంతో భారత్ 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించినట్లు కథనంలో పేర్కొన్నారు. తాజా స్వర్ణంతో ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కు చేరింది.

03



హిందూ ఓట్లర్లను ఏకం చేస్తాం

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించి తీరుతాం
- ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ గెలుపు ఖాయం
- గాంధీజీ ఆశయాలను కొనసాగిస్తున్నది మోదీనే
- గాంధీ పేరును రాజకీయాలకు వాడుకుంటున్న కాంగ్రెస్
- ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ విఫలం
- తెలంగాణ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కారే మార్గం
- మత ప్రాతిపదికన ఓట్ల సమీకరణకు కాంగ్రెస్ యత్నం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

జమ్మికుంట, సెప్టెంబర్ 2 (మహాప్రభ) హిందూ ఓట్లను ఏకం చేసి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఓడిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీజేపీని గెలిపించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు వచ్చిన ఆయన స్థానిక బీజేపీ నాయకులతో కలిసి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మహాత్మాగాంధీ పేరును కాంగ్రెస్ నాయకులు రాజకీయ అవసరాల కోసం ఉపయోగించుకుంటున్నారని బండి సంజయ్ ఆరోపించారు. గాంధీజీ ఆశయాలకు విరుద్ధంగా ఆ పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించారు. గాంధీజీ నిజమైన వారసత్వాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గాంధీజీ జీవితాన్ని, ఆయన అనుసరించిన సిద్ధాంతాలను ప్రస్తుత కాంగ్రెస్ రాజకీయాలతో పోల్చలేమన్నారు. గాంధీజీ ఏనాడూ పదవుల కోసం ఆరాటపడలేదని, కుటుంబ వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించలేదని వ్యాఖ్యానించారు. శ్రీరాముడిని సంపన్నుల దేవుడిగా కాంగ్రెస్ నాయకులు అభివర్ణిస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు.

-మిగతా 3 లో

విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

సరికొత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం

- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రల్ కిచెన్లు
- హరేకృష్ణ ఫౌండేషన్‌కు రెండు సంస్థల ఆర్థిక సహకారం
- నాగర్‌కర్నూల్ కిచెన్‌కు రూ.5.17 కోట్లు
- వికారాబాద్ కిచెన్ నిర్మాణానికి రూ.4 కోట్లు
- నవంబర్ 30లోగా కిచెన్ల ఏర్పాట్లు పూర్తి చేయాలి
- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభానికి సన్నాహాలు
- విద్యార్థుల ఆరోగ్యం, విద్యా పురోగతిపై ప్రత్యేక దృష్టి
- ఆహార నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: సెప్టెంబర్ 2 (మహాప్రభ) ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందించే పథకాన్ని అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సమక్షంలో ఈ సంస్థల ప్రతినిధులు కిచెన్ల నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించారు. హరేకృష్ణ ఫౌండేషన్, జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రతినిధులు

-మిగతా 3 లో





03

తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు

- మూడు రోజుల పాటు విస్తారంగా వానలు కురిసే అవకాశం
- అక్టోబర్ 4 నుంచి 6 వరకు భారీ వర్షాలకు ఛాన్స్
- తెలంగాణ, ఏపీలో పలు ప్రాంతాలకు వర్ష సూచన
- కోస్తాంధ్ర, రాయలసీమలో బలమైన ఈదురుగాలులు
- తమిళనాడు, కర్ణాటకలోనూ మారనున్న వాతావరణం
- కేరళలో అక్టోబర్ 7 వరకు వర్షాలు
- ఈశాన్య రాష్ట్రాల్లోనూ వానలు కురిసే అవకాశం
- వాతావరణ పరిస్థితులను గమనించాలని సూచన

యూసీసీ అమలు చేయనున్న గుజరాత్

- చట్టానికి రాష్ట్రపతి ఆమోదం..
- దేశంలో రెండో రాష్ట్రం

03





రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- కిలోమీటర్‌కు రూ.15 చొప్పున పెంపు
- తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30
- పెంచిన ధరలు నేటి నుంచే అమల్లోకి
- లగేజీపై కూడా అదనపు చార్జీలకు అనుమతి
- అధికారికంగా జీవో జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (మహాప్రభ) ఆటో డ్రైవర్లకు తెలంగాణ ప్రభుత్వ ఊరట కల్పించింది. ఆటో ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు శుక్రవారం రేవంత్ సర్కార్ అధికారికంగా ఒక జీవో కూడా జారీ చేసింది. ఆటోల కనీస చార్జీని రూ.20 నుంచి రూ.30కి పెంచుతున్నట్లు జీవోలో పొందుపర్చింది. ప్రతీ కిలోమీటర్‌కు రూ.11 నుంచి రూ.14కి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇక టిటెన్షన్ చార్జి 50 పైసల నుంచి 75 పైసలకు పెంచగా.. లగేజీ ఛార్జీ 25 పైసల నుంచి 50 పైసలకు పెంచారు. ఇక గరిష్ట లగేజీ పరిమితి 100 కిలోలుగా కొనసాగించారు. ఇక రాత్రి సమయాల్లో ఛార్జీలపై 1.5 రెట్లు కొనసాగించారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఆటో ఛార్జీలను ప్రభుత్వం సవరించింది.కొత్త ఆటో ఛార్జీల అమలు కోసం మీటర్ల రీసెట్టింగ్‌కు ప్రభుత్వం 3 నెలల గడువు విధించింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఒకటిన్నర శాతం అదనపు

-మిగతా 3 లో



03

పైలట్ మచ్చర్‌తో మోదీ వీడియో కాల్..

- ఫ్లైదుబాయ్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధాని సంభాషణ
- కాక్‌పిట్‌లో దాడి తర్వాత ప్రాణాలు కాపాడేందుకు పోరాటం
- ధైర్యం కోసం హనుమాన్ చాలీసా స్మరించానన్న పైలట్
- సౌదీ అరేబియాలోని తబుక్‌లో అత్యవసర ల్యాండింగ్
- మెరుగైన చికిత్స కోసం అబూదాబికి తరలింపు
- పైలట్ ధైర్యసాహసాలను ప్రశంసించిన మోదీ
- సోమనాథ్, కాశీలో ప్రార్థనలు చేసినట్లు వెల్లడి
- వీడియోను విడుదల చేసిన ప్రధానమంత్రి కార్యాలయం



03

కండక్టర్‌గా సీఎం విజయ్

- ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని విస్తరించిన తమిళనాడు ప్రభుత్వం
- ఏసీ బస్సులు మినహా మిగతా సర్వీసులకు పథకం వర్తింపు
- బస్సెక్కి మహిళలకు టికెట్లు అందించిన సీఎం
- కోయంబేడు బస్ టెర్మినల్‌లో పథకం ప్రారంభం

గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే మా పాలన



- వివక్ష లేని సమాజ నిర్మాణమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- గాంధీ భవన్‌లో గాంధీ జయంతి వేడుకలు

గాంధీ ఆశయాలే తమ ప్రభుత్వ పాలనకు స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గాడ్సే భావజాలాన్ని, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వివక్షకు తావులేని సమాజ నిర్మాణమే ప్రజా పాలన లక్ష్యమని స్పష్టం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఆయన.. కులమతాలకు అతీతంగా విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (మహాప్రభ) గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో

-మిగతా 3 లో

వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళికకు శ్రీకారం

-చిన్నవంగరలో ప్రత్యేక గ్రామ సభ.. గ్రామాభివృద్ధిపై ప్రజల భాగస్వామ్యంతో నిర్ణయాలు

-ఉపాధి పనులతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతిపాదనలు

-మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, గొర్రెల షెడ్లు, బోరు రీచార్జ్ పనులకు దరఖాస్తులు



పెద్దవంగర, అక్టోబర్ 2 (మహాప్రభ):
చిన్నవంగర గ్రామ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళిక పై ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని ప్రస్తుత అవసరాలు, ప్రజల సమస్యలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, సహజ వనరుల పరిరక్షణ తదితర అంశాలపై ప్రజలతో చర్చించి అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు.గ్రామ సభలో ప్రధానంగా VB-G RAM G పథకం అమలు, ఉపాధి అవకాశాలు, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, నీటి సంరక్షణ, జీవనోపాధి అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. 2026 ఏప్రిల్ 1 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని అధికారులు వివరించారు. గతంలో ఉన్న 100 రోజుల ఉపాధికి బదులుగా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల వేతన ఉపాధి కల్పించే అంశాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల అవసరాలకే ప్రాధాన్యం ఉపాధి కోరిన వారికి నిర్ణీత సమయంలో పని కల్పించడం, పని లభించని సందర్భంలో నిరుద్యోగ భృతి పొందే హక్కు, వేతనాలను సకాలంలో చెల్లించే విధానం తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి ప్రణాళికలో చేర్చాలని సూచించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, నీటి వనరుల సంరక్షణ, సహజ వనరుల పరిరక్షణ, ప్రజలకు ఉపయోగపడే ఆస్తుల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. గ్రామ సభ, గ్రామ పంచాయతీ కలిసి ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళిక రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు దరఖాస్తుల వెల్లువ
గ్రామ సభలో గ్రామస్థులు తమకు అవసరమైన వివిధ అభివృద్ధి, జీవనోపాధి పనుల కోసం దరఖాస్తులు సమర్పించారు. ముఖ్యంగా ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, గడ్డి పెంపకం, గొర్రెల షెడ్లు, బోరు రీచార్జ్ పనులు, కొత్త బావుల తవ్వకం, మరుగుదొడ్ల నిర్మాణం, బావుల పూడికతీత పనులు తదితర పనులకు దరఖాస్తులు అందజేశారు.
గ్రామంలోని ప్రతి కుటుంబానికి, రైతులకు, కూలీలకు ఉపయోగపడే పనులను గుర్తించి ప్రణాళికలో చేర్చాలని ప్రజలు కోరారు. తమ గ్రామ అవసరాలు, సమస్యలు, అభివృద్ధి ప్రతిపాదనలను గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారు.

భారీగా పాల్గొన్న గ్రామస్థులు
గ్రామ సభకు సర్పంచ్ మూస్కు పూలమ్మ అధ్యక్షత వహించగా, పంచాయతీ కార్యదర్శి అజయ్, ఉపసర్పంచ్ యాసారపు రవి, వార్డు సభ్యులు పాల్గొన్నారు. గ్రామ రైతులు, మహిళలు, యువత, యూత్ సభ్యులు, కూలీలు, ఇతర గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.
ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళిక ద్వారా గ్రామంలోని మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు ఉపాధి, జీవనోపాధి అవకాశాలు పెరుగుతాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

పాత్రికేయుల డిమాండ్లు పరిష్కరించాలి.

-గాంధీ విగ్రహం ముందు టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'డిమైండ్స్ డే'

-కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం



మెదక్ జిల్లా -02అక్టోబర్ (మహాప్రభ).
దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్లు పరిష్కరించాలని ఐజేయూ పిలుపుమేరకు టియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రం మెదక్ రాందాస్ చౌరస్తాలో డిమాండ్స్ డే నిరసన చేపట్టి, కలెక్టర్ ఎఓ యూనుస్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు ఎ. శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ... జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా 'పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ల దినం'గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ రంగాన్ని సమగ్రంగా సమీక్షించి, ఆధునిక యుగానికి అనువైన విధాన సిఫార్సులను రూపొందించడానికి ఒక కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయడం అత్యవసరమన్నారు. పాత్రికేయులు, మీడియా సంస్థల భద్రత కోసం ఒక ప్రత్యేక కేంద్ర చట్టాన్ని రూపొందించాలన్నారు.
పత్రికా రంగం భారత ప్రజాస్వామ్యానికి నాల్గవ స్తంభంగా పనిచేస్తుంది. స్వతంత్ర, సురక్షితమైన మీడియా వాతావరణం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి పునాది. శారీరక దాడులు, ఏకపక్ష నిర్బంధాలు, ఆన్‌లైన్ వేధింపులు, సంస్థాగత బెదిరింపులను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. మీడియా సిబ్బంది తమ విధులను నిర్భయంగా నిర్వర్తించేలా చూడటానికి, కేంద్ర ప్రభుత్వం పాత్రికేయులను, మీడియా సిబ్బందిని, వార్తా సంస్థలను హింస, అనుచిత అణచివేత నుండి కాపాడే ఒక పటిష్టమైన, స్వతంత్ర జాతీయ చట్టాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 1955, 1958 చట్టాల కింద మొదటగా హామీ ఇవ్వబడిన ప్రత్యేక రక్షణలను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. మీడియా ఉద్యోగుల కోసం రెండు దశాబ్దాల క్రితం, 2007లో ఏర్పాటు చేయబడింది. జీవన వ్యయాలు, ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగినప్పటికీ, ప్రభుత్వ, కార్పొరేట్ రంగాలలో జీతాలు ఎప్పటికప్పుడు సవరించబడుతున్నప్పటికీ, మీడియా కార్మికులకు చట్టబద్ధమైన వేతన నవీకరణలు అందలేదు. ముద్రణ, ప్రసార మరియు డిజిటల్ మీడియా సిబ్బందిని కలుపుకొని, న్యాయమైన, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేయబడిన పరిహార నిర్మాణాలను సిఫార్సు చేయడానికి ఒక కొత్త వేతన మండలిని ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు.
రాష్ట్రంలో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ళు, ఇళ్లస్థలాల సమస్య పరిష్కరించడంతోపాటు ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలని, జర్నలిస్టులపై నిత్యం జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తగిన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి. శ్రీనివాస్ శర్మ, ఐజేయూ సభ్యులు శ్రీనివాస్ మిన్పూర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు బొందుగుల నాగరాజు, ప్రెస్ క్లబ్ కోశాధికారి అశోక్, గౌరవ సలహాదారులు ఫారూక్ హుస్సేన్, శ్రీధర్, హరినాథ్, గౌరవ అధ్యక్షులు కామాటి కృష్ణ, సీనియర్ జర్నలిస్టులు, యూనియన్ బాధ్యులు రమేష్ గౌడ్, నగేష్, శివ చరణ్, రాము పటేరి, ప్రకాష్, రామ కృష్ణ గౌడ్, కృష్ణ గౌడ్, రాజశేఖర్, బోనగిరి చంద్రశేఖర్, మన్నే శ్రీనివాస్,గోవర్ధన్ రెడ్డి, చింతల రమేష్, ఖయ్యూం, యూసుఫ్ అలీ, సఫ్దర్, హమీద్, రాము పటేరి, నరేందర్, నర్సింహులు, సత్యనారాయణ, బైరవరెడ్డి, రాంచందర్ రెడ్డి, గిరి, శ్రీహరి గౌడ్, కార్తీక్, సాయి, ఆంజనేయులు గౌడ్, సుభాష్, రాఘువులు, జనార్దన్, రఘు, స్వాగత్ రాజు, శ్రీను, రాజ శేఖర్, అల్లాడి శేఖర్, లక్ష్మి నారాయణ, మురళీధర్, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ జయంతి వేడుకలో పాల్గొన్న చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్

-చిత్రపటానికి నివాళులర్పించిన చైర్మన్ మరియు పాలకవర్గం

-గాంధీ అనుసరించిన మార్గాలు సత్యం శాంతి అహింస



తూప్రాన్ అక్టోబర్ 2,(మహాప్రభ)
జాతి పిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూల మాలలు సమర్పించి జయంతి వేడుకలు నిర్వహించి, నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం మహాత్మా గాంధీ అహింస సత్యగ్రహ మార్గాలను అనుసరించి ప్రజలను ఏకతాటిపై కి తీసుకువచ్చారని అన్నారు సత్యం అహింస శాంతి స్వచ్ఛత గ్రామ స్వరాజ్యం వంటి మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు గాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుస్తూ సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కమిషనర్ రమేష్ కుమార్ కౌన్సిలర్లు సత్యలింగం, రాములు, మరియు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నర్స్ ఉద్యోగమని చెప్పి పని మనిషిని చేశారు

-కన్సల్టెన్సీ మోసంపై యువతి తండ్రి ఫిర్యాదు



రాంచీ: సెప్టెంబర్ 2 (మహాప్రభ)
దుబాయ్‌లో నర్స్ ఉద్యోగమని చెప్పి తన కూతురిని అక్కడ పని మనిషిగా మార్చారని ఓ యువతి తండ్రి రాంచీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రైవేట్ కన్సల్టెన్సీ ఏజెంట్ ప్రియాంక ఆర్య, ఆమె భర్త రితేశ్, మెరాజ్ అన్సారీలపై కేసు నమోదైంది. బాధితురాలు మోనికా కచ్చప్‌కు ప్రియాంక ఆర్య పరిచయమయ్యారు. దుబాయ్‌లో నర్స్ ఉద్యోగం ఇప్పిస్తానని ప్రియాంక హామీ ఇచ్చారు.రితేశ్ అరబిక్‌లో ఉన్న కొన్ని పత్రాలపై బాధితురా లితో సంతకాలు చేయించి, రూ.3.30 లక్షలు అప్పుగా తీసుకొన్నట్టు..ఆ మొత్తం చెల్లించిన తర్వాతనే ఆమెను భారత్‌కు తిరిగి వెళ్లేందుకు అనుమతిస్తారని ఆమెకు తెలిపారు. ఆమె ఆమె పాస్‌పోర్టును కన్సల్టెన్సీ కంపెనీ ఏజెంట్లు స్వాధీనం చేసుకొన్నారని బాధితురాలి తల్లి వెల్లడించారు.

అంతరిక్షంలోకి భారత్ తొలి ఏఐ ఉపగ్రహం

-అంతరిక్షంలోనే చిత్రాలను విశ్లేషించే సామర్థ్యం

-హైదరాబాద్‌కు చెందిన టెక్ మీ టూ ఘనత



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (మహాప్రభ)
ఫొటోలను తీసి భూమికి పంపడమే కాకుండా అంతరిక్షంలోనే వాటిని విశ్లేషించగల మొట్టమొదటి ఉపగ్రహాన్ని భారత్ అంతరిక్షంలోకి పంపింది. హైదరాబాద్‌కు చెందిన టెక్ మీ టూ స్పేస్ సంస్థ స్పేస్ ఎక్స్ ట్రాన్స్‌పోర్టర్-18 మిషన్ ద్వారా తన ఎంవోఐ-1ఏ ఉపగ్రహాన్ని గురువారం రాత్రి 11.48 గంటలకు ప్రయోగించింది.అనవసరమైన డాటాను తొలగించి, కేవలం ఉపయోగకరమైన సమాచారాన్ని మాత్రమే భూమికి పంపగల సామర్థ్యం ఏఐకి ఉంటుందని కంపెనీ సీఈవో రౌనక్ కుమార్ సమంతరాయ్ తెలిపారు. ఉదాహరణకు, ఒక ఉపగ్రహం 300 బీజీ డాటాను సేకరించి అందులో కొంత భాగం మాత్రమే అవసరమైతే, ఏఐ ఆ భాగాన్ని వేరు చేసి పంపగలదు. ఇది భూమికి చిత్రాలు, డాటాను పంపడంలో అయ్యే సమయం, ఖర్చును తగ్గించగలదు. సంస్థ తెలిపిన వివరాల ప్రకారం ఇది భారతదేశపు మొట్టమొదటి ఆర్బిటల్ కంప్యూటింగ్ ఉపగ్రహం. అమెరికా, యూరోపియన్ యూనియన్, చైనా తర్వాత ఈ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని నాల్గవ దేశంగా భారత్ నిలిచింది. ప్రస్తుతం ఉపగ్రహం నుంచి వచ్చే డాటా మొదట భూమికి చేరుకుంటుంది. ఆ తర్వాత దానిని పరిశీలించి, విశ్లేషిస్తారు. ఈ సాంకేతికతను వరదలు, అడవులు, పంటలు, గనుల ప్రాంతాలు, సరిహద్దులు, భూమిని పర్యవేక్షించడానికి ఉపయోగించవచ్చు.

బిహార్‌లో విషాదం..

-చెరువులో మునిగి నలుగురు బాలికలు మృతి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (మహాప్రభ)
బిహార్‌లో విషాదం జరిగింది. ఒక చెరువులో మునిగిన నలుగురు బాలికలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బిహార్, ఈస్ట్ చంపారన్ జిల్లా, ఇనర్వభార్ పంచాయత్ పరిధిలోని బంకాట్ గ్రామంలో శుక్రవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్ని పహర్‌పూర్ పోలీస్ స్టేషన్ పోలీసులు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం, బంకాట్ గ్రామానికి చెందిన ఐదుగురు బాలికలు స్థానిక చెరువుకు ఉదయం 9.30 గంటల సమయంలో స్నానం చేసేందుకు వెళ్లారు.ఐదుగురు బాలికలలో నలుగురు నీటిలోకి వెళ్లగా.. ఒక బాలిక ఒడ్డునే ఉండిపోయింది. లోపలికి వెళ్లిన బాలికలు లోతును అంచనా వేయలేకపోయారు. అలా ఇంకా నీటిలోకి వెళ్లి మునిగిపోయారు. కళ్లముందే నలుగురు మునిగిపోవడంతో అక్కడే ఉన్న బాలిక పక్కనే ఉన్న కొందరికి వెంటనే విషయం చెప్పింది. వెంటనే సమాచారం అందుకున్న గ్రామస్తులు, పోలీసులు అక్కడికి చేరుకుని బాలికల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చెరువులో గల్లంతైన నలుగురు బాలికల మృతదేహాల్ని వెలికితీశారు. మృతుల్లో ఇద్దరు అక్కాచెల్లెలు కూడా ఉన్నారు. మృతులంతా 13 ఏళ్లలోపు బాలికలే. వారి వివరాలివి. సోనావతి కుమారి (13), ఆమె చెల్లి ఫూల్వతి కుమారి (10), సోనాలి కుమారి (10), ప్రతిభా కుమారి (12). వీరి మృతదేహాల్ని పోలీసులు స్థానిక మోతిమరి సర్దార్ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. పిల్లలు ఇలా మరణించడంతో వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. పిల్లలు ఎలా మరణించారో పోస్టుమార్టం రిపోర్టు తర్వాత వెల్లడవుతుందని పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని జిల్లా మెజిస్ట్రేట్ సౌరభ్ సుమన్ ప్రకటించారు.

జార్ఖండ్‌లో 'సర్' దుమారం

-ఒక్క నియోజకవర్గం నుంచే 36 శాతం ఓట్ల తొలగింపు దరఖాస్తులు



నన్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (మహాప్రభ)
జార్ఖండ్‌లో ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించాలంటూ వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు మూడో వంతు కేవలం ఒక్క అసెంబ్లీ నియోజకవర్గం నుంచే వచ్చాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) అక్టోబర్ ఒకటిన వెల్లడించిన వివరాల్లో తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఓట్ల తొలగింపు కోసం ఎన్నికల సంఘానికి మొత్తం సుమారు 13,000 దరఖాస్తులు అందాయి.జార్ఖండ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమం జూన్ 30న ప్రారంభమైంది. ఇప్పటివరకు 43.6 లక్షల ఓటర్ల వివరాల్లో తప్పులు లేదా తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మార్పులు, చేర్పుల తరువాత తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19న విడుదల చేయనున్నారు. కాగా ఒక్క ఛత్రా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల లిస్టు నుంచి పేర్ల తొలగింపునకు ఏకంగా 4,790 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రం మొత్తం మీద వచ్చిన మొత్తం దరఖాస్తుల్లో ఇవే 36 శాతం కావడం గమనార్హం. ప్రస్తుతం ఈ స్థానానికి ఎల్జేపీ(రామ్‌విలాస్) పార్టీ ఎమ్మెల్యే జనార్దన్ పాశ్వాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన 2024 ఎన్నికల్లో 18,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచారు. కాగా ఛత్రా నియోజకవర్గం లెక్కలను అధికారులతో సరిచూశామని, ఇందులో ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని రాష్ట్ర సీఈవో కే రవి కుమార్ స్పష్టం చేశారు.

పశ్చిమాసియాకు 9,000 అదనపు బలగాలు

మూడవ విమాన వాహక నౌకతోపాటు మరిన్ని యుద్ధ విమానాలు

మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై మళ్లీ దాడులు: ట్రంప్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (మహాప్రభ)
పశ్చిమాసియాలో అమెరికా తన సైనిక ప్రాబల్యాన్ని మరింత పెంచింది. సుమారు 9,000 మంది అదనపు సైనికులతోపాటు తన మూడవ విమాన వాహక నౌక యూఎస్ఎస్ థియోడర్ రూజ్‌వెల్ట్‌ను కూడా ఆ ప్రాంతానికి పంపుతున్నది. అక్టోబర్ చివరి నాటికి పశ్చిమాసియాలో అమెరికాకు చెందిన మూడు విమాన వాహక నౌకలు మోహరించి ఉంటాయి. నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై దాడులు ప్రారంభిస్తామని ట్రంప్ గతంలో పేర్కొన్నారు.పశ్చిమాసియాకు అమెరికా పంపుతున్న కొత్త నౌకాదళ బలగంలో యూఎస్ఎస్ థియోడర్ రూజ్‌వెల్ట్‌తోపాటు యూఎస్ఎస్ మాకిన్ ఐలాండ్, ఇతర యుద్ధనౌకలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం అవి ఆ ప్రాంతం వైపు పయనిస్తున్నాయి. థియోడర్ రూజ్‌వెల్ట్ ఆగమనంతో ఆ ప్రాంతంలో మళ్లీ మూడు అమెరికా విమాన వాహక నౌకలు ఉండనున్నాయి. మూడు విమాన వాహక నౌకలను అమెరికా మోహరించడం 2003 నుంచి ఇదే మొదటిసారి.

పైలట్ మచ్చర్‌తో మోదీ వీడియో కాల్..

ఫ్లైదుబాయ్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధాని సంభాషణ
కాక్‌పిట్‌లో దాడి తర్వాత ప్రాణాలు కాపాడేందుకు పోరాటం
ధైర్యం కోసం హనుమాన్ చాలీసా స్మరించానన్న పైలట్
సౌదీ అరేబియాలోని తబుక్‌లో అత్యవసర ల్యాండింగ్
మెరుగైన చికిత్స కోసం అబూదాబికి తరలింపు
పైలట్ ధైర్యసాహసాలను ప్రశంసించిన మోదీ
సోమనాథ్, కాశీలో ప్రార్థనలు చేసినట్లు వెల్లడి
వీడియోను విడుదల చేసిన ప్రధానమంత్రి కార్యాలయం



న్యూఢిల్లీ

ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న ఘటనలో ప్రయాణికుల ప్రాణాలను కాపాడేందుకు ధైర్యంగా వ్యవహరించిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. విమాన ప్రయాణ సమయంలో కోపైలట్ దాడి చేయడంతో తీవ్ర పరిస్థితులను ఎదుర్కొన్న మచ్చర్.. ఆ సమయంలో ధైర్యం కోసం హనుమాన్ చాలీసాను స్మరించుకున్నట్లు ప్రధానితో తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైలట్ ఆరోగ్య పరిస్థితిని మోదీ అడిగి తెలుసుకున్నారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసింది. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో కాక్‌పిట్‌లో కోపైలట్ తనపై దాడి చేసినట్లు మచ్చర్ వివరించారు. తాను 11 ఏళ్లుగా పైలట్‌గా పనిచేస్తున్నానని, దాడి జరిగిన సమయంలో కిందపడిపోయానని చెప్పారు. పరిస్థితి ఏమిటో తనకు అర్థమైందని, అయితే వెంటనే స్పందించేందుకు కొన్ని సెకన్ల సమయం మాత్రమే ఉందని తెలిపారు. ఆ క్లిష్ట సమయంలో నిరంతరం హనుమాన్ చాలీసాను స్మరించుకుంటూ ధైర్యాన్ని కూడగట్టుకున్నానని వివరించారు. కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు శక్తిని కూడగట్టుకున్నానని, ఆ తర్వాత ప్రయాణికులు అక్కడికి వచ్చినట్లు మచ్చర్ ప్రధానికి చెప్పారు. ఆ సమయంలో తన ఆలోచనంతా ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంపైనే ఉందని తెలిపారు. ప్రతిరోజూ హనుమాన్ చాలీసా చదువుతానని, ఆపద సమయంలో దానిని స్మరించుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటన అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్ విమానాశ్రయంలో అత్యవసరంగా దించారు. అక్కడ మచ్చర్‌కు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అబూదాబికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనతో మోదీ మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గుజరాతీ భాషలో జరిగిన సంభాషణలో మచ్చర్ ధైర్యసాహసాలను ప్రధాని ప్రశంసించారు. ఆయన త్వరగా కోలుకోవాలని సోమనాథ్, కాశీ క్షేత్రాల్లో ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. మచ్చర్ తల్లిదండ్రులతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయనతో మాట్లాడేందుకు ఆసక్తిగా ఉన్నారని, భారత్ ఆయనకు స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తోందని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారతీయుల సేవాభావాన్ని ప్రస్తావిస్తూ.. భారతీయులు ప్రాణాలు తీయడానికి కాదు, ప్రాణాలు కాపాడటానికి ముందుంటారని మోదీ వ్యాఖ్యానించినట్లు కథనంలో పేర్కొన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిచ్చిన పైలట్ ధైర్యాన్ని ఆయన అభినందించారు.

హిందూ ఓటర్లను ఏకం చేస్తాం

(మొదటి తరువాయి)

బీజేపీ నాయకులు సంపన్నులు కావడంతోనే రాముడిని కొలుస్తున్నారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారని పేర్కొన్నారు. జీవితాంతం రామనామాన్ని జపించిన మహాత్మాగాంధీ సంపన్నుడా? ఆయన ఆరాధించిన శ్రీరాముడు సంపన్నుల దేవుడా? అని ప్రశ్నించారు. గాంధీజీ పేరును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం మినహా ఆయన ఆశయాలను కాంగ్రెస్ ఆచరిస్తున్న దాఖలాలు లేవని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర రాజకీయ అంశాలను తెరపైకి తెస్తూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నిస్తోందని బండి సంజయ్ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి వేగవంతమవుతుందని అన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడితేనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ ఆరోపించారు. మత ప్రాతిపదికన ఓట్లను సమీకరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా బీజేపీని ఎదుర్కోలేవని వ్యాఖ్యానించారు. హిందూ ఓట్లను ఏకం చేసి ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

యూసీసీ అమలు చేయనున్న గుజరాత్..

చట్టానికి రాష్ట్రపతి ఆమోదం.. దేశంలో రెండో రాష్ట్రం



న్యూఢిల్లీ

యూసీసీ (యునిఫాం సివిల్ కోడ్) చట్టాన్ని గుజరాత్ రాష్ట్రం అమలు చేయబోతుంది. దీనిపై గుజరాత్ అసెంబ్లీలో గత మార్చిలో చేసిన తీర్మానాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా ఆమోదించారు. దీంతో ఈ చట్టం రాష్ట్రంలో అమలులోకి రానుంది. యూసీసీని అమలు చేయబోతున్న రెండో రాష్ట్రంగా గుజరాత్ నిలవబోతుంది. ఇంతకుముందు మొదటిసారిగా ఉత్తరాఖండ్ ఈ చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు గుజరాత్ కూడా ఈ చట్టాన్ని అమలు చేయబోతుంది.ద గుజరాత్ యునిఫాం సివిల్ కోడ్ బిల్, 2026 పేరిట ఈ బిల్లును సీఎం భూపేంద్ర పటేల్ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ మేరకు గుజరాత్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో ఇకపై వివాహం, సహజీవనం, ఆస్తి పంపకాలు వంటివన్నీ ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ విషయాల్లో కొత్త రూల్స్ అమలవుతాయి. యూసీసీ ప్రకారం చట్టంలో రానున్న కీలక మార్పులివే. గిరిజన తెగలకు మినహా అందరికీ ఈ చట్టం వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం వారసత్వపు ఆస్తి హక్కు విషయంలో స్త్రీలు, పురుషులకు సమాన హక్కులుంటాయి. అంటే, కొడుకుకైనా, కూతురుకైనా ఆస్తి విషయంలో సమాన హక్కు ఉంటుంది. ఎవరైనా సహజీవనం చేస్తే ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. అలా చేయకుండా సహజీవనాన్ని కొనసాగించినా కూడా నేరమే. పెళ్లిళ్లతో సమానంగా సహజీవనాన్ని కూడా నమోదు చేసుకోవాల్సిందే. విడాకులు కూడా చట్టబద్ధంగా జరగాల్సిందే. సహజీవనం విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కీలకంగా చెప్పుకోవాలి. తాము సహజీవనానికి వ్యతిరేకం కాదని సీఎం భూపేష్ పటేల్ చెప్పారు. అయితే, ఈ విషయంలో మహిళల హక్కులకు ప్రాధాన్యం ఇస్తామని, అందువల్లే సహజీవనానికి కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేలా చట్టం తెచ్చామన్నారు. రాష్ట్రంలో మహిళలు అందరికీ సమాన హక్కులు ఉంటాయని, మత పరంగా ఎలాంటి మినహాయింపు ఉండదని సీఎం అన్నారు. అన్ని మతాలవారికి సమానంగా యూసీసీ చట్టం వర్తిస్తుందన్నారు.

గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

(మొదటి తరువాయి)

ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

44 ఏళ్ల నిరీక్షణకు తెర..

ఫైనల్లో చైనాపై భారత్ 1-0తో ఉత్కంఠ విజయం
ఆసియా క్రీడల్లో రెండోసారి పసిడి పతకం
1982 తర్వాత మళ్లీ స్వర్ణం సాధించిన భారత జట్టు
లాల్రెమ్‌సియామి కీలక గోల్‌తో భారత్‌కు ఆధిక్యం
గోల్‌కీపర్ సవితా పునియా అద్భుత ప్రదర్శన
చైనా దాడులను సమర్థంగా అడ్డుకున్న భారత రక్షణ
2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత
భారత్ ఖాతాలో 16వ స్వర్ణ పతకం



న్యూఢిల్లీ, అక్టోబర్ 2 (ఆర్ఎన్ఎ): భారత మహిళల హాకీ జట్టు చరిత్ర సృష్టించింది. ఆసియా క్రీడల్లో 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. శుక్రవారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ చైనాను 1-0 తేడాతో ఓడించి పసిడిని సొంతం చేసుకుంది. ఈ విజయంతో భారత హాకీ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆసియా క్రీడల్లో అగ్రస్థానాన్ని అందుకున్న భారత అమ్మాయిలు తమ అద్భుత ప్రదర్శనతో దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఫైనల్ పోరు ఆరంభం నుంచే హోరాహోరీగా సాగింది. తొలి క్వార్టర్‌లో భారత జట్టు దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. ఈ క్రమంలో లాల్రెమ్‌సియామి కీలక ఫీల్డ్ గోల్ సాధించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ గోల్ మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారింది. ఆధిక్యంలోకి వచ్చిన భారత జట్టు ఆ తర్వాత ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా ఆడింది. ఒక గోల్ వెనుకబడిన చైనా మ్యాచ్‌లోకి తిరిగి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. వరుస దాడులతో భారత గోల్‌పోస్ట్‌పై ఒత్తిడి పెంచింది. అయితే భారత రక్షణ విభాగం సమన్వయంతో వ్యవహరిస్తూ చైనా ప్రయత్నాలను సమర్థంగా అడ్డుకుంది. ముఖ్యంగా గోల్‌కీపర్ సవితా పునియా కీలక సమయంలో తన ప్రతిభను చాటింది. చైనాకు లభించిన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు ఆధిక్యాన్ని కాపాడింది. దీంతో భారత శిబిరంలో ఉత్సాహం నెలకొంది. మ్యాచ్ చివరి నిమిషాల వరకు చైనా గోల్ కోసం ప్రయత్నించినా భారత రక్షణను ఛేదించలేకపోయింది. చివరి వరకు ఏకాగ్రతతో ఆడిన భారత మహిళలు 1-0 ఆధిక్యాన్ని నిలబెట్టుకుని విజయం సాధించారు. కీలక సమయంలో గోల్ సాధించడం, ఆ తర్వాత ప్రత్యర్థి దాడులను నిలువరించడం భారత విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఆసియా క్రీడల్లో భారత మహిళల హాకీ జట్టుకు ఇది రెండో స్వర్ణ పతకం. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ పసిడి సాధించింది. ఆ తర్వాత మళ్లీ స్వర్ణం కోసం ఎదురుచూస్తున్న జట్టుకు తాజా విజయం చారిత్రాత్మకంగా నిలిచింది. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన నిరీక్షణకు తెరదించుతూ భారత అమ్మాయిలు మరోసారి ఆసియా చాంపియన్లుగా అవతరించారు. ఈ విజయంతో భారత జట్టుకు మరో కీలక ప్రయోజనం కూడా దక్కింది. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది. అంతకుముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై విజయం సాధించి ఫైనల్‌కు చేరిన భారత జట్టు, తుదిపోరులోనూ అదే జోరును కొనసాగించింది. మహిళల హాకీ జట్టు సాధించిన ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కు చేరింది. భారత క్రీడా రంగానికి ఈ విజయం మరో మైలురాయిగా నిలిచింది.

విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్..

(మొదటి తరువాయి)



జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్‌రెడ్డిని కలిశారు. నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సహకరించేందుకు ముందుకొచ్చారు. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ నిర్మాణం కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ సీఎండీ శేఖర్‌రెడ్డి, సీఈఓ అనిల్‌బాబు కలిసి రూ.5.17 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. వికారాబాద్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్‌కుమార్ కలిసి రూ.4 కోట్ల చెక్కును ఫౌండేషన్‌కు అందించారు. దీంతో రెండు సంస్థల నుంచి మొత్తం రూ.9.17 కోట్ల ఆర్థిక సహకారం అందింది. విద్యార్థుల సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమానికి నిధులు సమకూర్చేందుకు ముందుకొచ్చిన సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా సెంట్రల్ కిచెన్ల ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నవంబర్ 30వ తేదీలోగా కిచెన్ల నిర్మాణం, ఇతర ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. డిసెంబర్ 9 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి కిచెన్లను ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, శారీరక ఎదుగుదల, విద్యా పురోగతికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన ట్రాక్ రికార్డును నిర్వహించాలని తెలిపారు. వారికి అందించే ఆహార పదార్థాల్లోని కేలరీలను లెక్కించేందుకు యాప్‌లను వినియోగించాలని సూచించారు. విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుతో విద్యార్థులు సమయానికి పాఠశాలలకు చేరుకునే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అయితే, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆహార తయారీ, పంపిణీ ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. ప్రాంతాలవారీగా విద్యార్థుల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ మెనూను రూపొందించాలని రేవంత్‌రెడ్డి తెలిపారు. దీర్ఘకాలం కొనసాగించాల్సిన కార్యక్రమం కావడంతో సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. కిచెన్ల నిర్వహణ, ఆహార నాణ్యత, విద్యార్థులకు అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ, ఆయా సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు

మూడు రోజుల పాటు విస్తారంగా వానలు కురిసే అవకాశం
అక్టోబర్ 4 నుంచి 6 వరకు భారీ వర్షాలకు ఛాన్స్
తెలంగాణ, ఏపీలో పలు ప్రాంతాలకు వర్ష సూచన
కోస్తాంధ్ర, రాయలసీమలో బలమైన ఈదురుగాలులు
తమిళనాడు, కర్ణాటకలోనూ మారనున్న వాతావరణం
కేరళలో అక్టోబర్ 7 వరకు వర్షాలు
ఈశాన్య రాష్ట్రాల్లోనూ వానలు కురిసే అవకాశం
వాతావరణ పరిస్థితులను గమనించాలని సూచన



న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ఉత్తర భారతదేశంలో కొనసాగుతున్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అక్టోబర్ 7 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అక్టోబర్ 4 నుంచి 6 మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని పేర్కొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశముంది. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అక్టోబర్ 2 నుంచి వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ పరిస్థితులు అక్టోబర్ 5 వరకు కొనసాగవచ్చని తెలిపింది. తెలంగాణలోనూ అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కేరళ, మాహే ప్రాంతాల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ నెల 4 నుంచి 6 మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపింది. అక్టోబర్ 2న కేరళ, లక్షద్వీప్, తమిళనాడు ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కర్ణాటకలోనూ వర్షాలు కొనసాగనున్నాయి. కోస్తా కర్ణాటకలో అక్టోబర్ 2న విస్తారంగా వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ కర్ణాటకలో అక్టోబర్ 5న అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. దీంతో బెంగళూరు సహా దక్షిణ కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో వాతావరణం మారే అవకాశం ఉంది. మహారాష్ట్రలోని కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లోనూ అక్టోబర్ 7 వరకు అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఈశాన్య భారతదేశంలోనూ వర్షాలు కురిసే అవకాశముంది. అరుణాచల్‌ప్రదేశ్, అస్సోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని ఐఎండీ తెలిపింది. అక్టోబర్ 2న ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది. ఒడిశా, పశ్చిమ బెంగాల్, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవుల్లోనూ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. బీహార్, జార్ఖండ్‌లో అక్టోబర్ 5 నుంచి 7 మధ్య, ఛత్తీస్‌గఢ్‌లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు వర్షాలు పడొచ్చని వెల్లడించింది. మరోవైపు ఉత్తర భారతదేశంలో నైరుతి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతోంది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని మరిన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనక్కి వెళ్లే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోనూ రుతుపవనాల ప్రభావం తగ్గుతోంది. ఉత్తరాదిలో వర్షాలు తగ్గుముఖం పడుతుండగా, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం అక్టోబర్ మొదటి వారం వరకు వర్షాలు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలు స్థానిక వాతావరణ హెచ్చరికలను గమనించాలని అధికారులు సూచిస్తున్నారు.

కండక్టర్‌గా సీఎం విజయ్



నేషనల్ బ్యూరో:
తమిళనాడు సీఎం విజయ్ నిన్న కండక్టర్ అవతారమెత్తారు. టీవీకే అధికారంలోకి వచ్చాక తెచ్చిన ఫ్రీ బస్ స్కీంను మరింత విస్తృతం చేశారు. ఆర్డినరీ బస్సులకే ఉన్న ఈ పథకాన్ని ఏసీ మినహా ఇతర అన్ని బస్సులకూ వర్తించారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ బస్ ఎక్కి కండక్టర్‌గా మహిళా ప్రయాణికులకు టికెట్లు అందించారు. కోయంబేడు బస్ టెర్మినల్‌లో జరిగిన ఈ ప్రారంభోత్సవంలో సీఎం విజయ్ ప్రయాణికులతో ముచ్చటించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ సుమారు 85 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేయనున్నారు. మహిళలు ఒక రోజులో ఎన్ని సార్లైనా, ఎంత దూరమైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను పొందడంలో, జీవితంలో మహిళలు పురోగతి సాధించడంలో బస్సు ఛార్జీల భారం అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి విజయ్ తమిళన్ పార్టీబన్ తెలిపారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు ఈ పథకం ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

రాష్ట్రంలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

(మొదటి తరువాయి)

ఛార్జీలు వసూలు చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. మూడు నెలల్లోగా ఆటో డ్రైవర్లు డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆటో ఛార్జీలను అధికారికంగా ధృవీకరిస్తూ జీవో 46 జారీ చేసింది. ఈ ఛార్జీలు తక్షణమే అమల్లో వస్తాయని వెల్లడించింది. ఇక ట్రాఫిక్ లేదా ఇతర కారణాల వల్ల ఆటో ఆగినప్పుడు నిమిషానికి 75 పైసలు చొప్పున వెయిటింగ్ ఛార్జీ ఖరారు చేశారు. రాత్రి సమయాల్లో ప్రయాణించేవారు సాధారణ ఛార్జీల కంటే అదనంగా 50 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇక ప్రయాణికులు ఆటోలో తమ వెంట హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ వంటికి ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఇతర పెద్ద లగేజీలు తీసుకెళ్లాలంటే కిలోమీటర్‌కు 50 పైసలు చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.ఆటోలో తొలి 1.6 కిలోమీటర్లకు కనీస ఛార్జీ రూ.30గా ఫిక్స్ చేశారు. ఆ తర్వాత ప్రతీ అదనపు కిలోమీటర్‌కు రూ.15 చొప్పున ఖరారు చేశారు. ఇక కొత్త ధరలపై ఆటోల్లో ఫేర్ కార్డులను ఏర్పాటు చేయాలని డ్రైవర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా ఆటో ఛార్జీలను పెంచాలని డ్రైవర్ల సంఘాలు ఇటీవల సమ్మెకు పిలుపునిచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆటోలను నిలిపివేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి ఆటో సంఘాలతో చర్చలు జరిపింది. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఆటో డ్రైవర్లు సమ్మెపై వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్లకు ఊరట కల్పిస్తూ ఛార్జీలను ప్రభుత్వం పెంచింది. అలాగే డ్రైవర్ల సంక్షేమ కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. అయితే ఛార్జీల పెంపు వల్ల డ్రైవర్లకు ప్రయోజనం చేకూరనుండగా.. సామాన్యులకు భారమనే చెప్పుకోవచ్చు.

గాంధీజీ ఆశయాలే కాంగ్రెస్‌కు మార్గదర్శకం

-గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే బాలు నాయక్ నివాళులు



దేవరకొండ అక్టోబర్ 2 (మహాప్రభ)
మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటికీ సమాజానికి మార్గదర్శకాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.
గాంధీ జయంతి సందర్భంగా దేవరకొండ పట్టణంలోని 16వ వార్డు గాంధీ బజార్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే బాలు నాయక్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేవరకొండ మున్సిపల్ వర్కర్లతో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ గాంధీజీ దేశానికి చేసిన సేవలను, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను గుర్తుచేశారు. మహాత్మా గాంధీ భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచారని ఎమ్మెల్యే అన్నారు. సత్యాగ్రహం, అహింసను ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం, ప్రజలను చైతన్యపరిచిన తీరు భారత చరిత్రలో చిరస్మరణీయమన్నారు. గాంధీజీ చూపిన మార్గం నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని చెప్పారు. గాంధీజీకి కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం దేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో కీలకమైనదని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీని సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలను స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములను చేసి, సామాన్య ప్రజలే దేశానికి నిజమైన బలమనే భావనను గాంధీజీ బలపరిచారని అన్నారు. గాంధీజీ కలలు కన్న సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, శాంతి, సోదరభావం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గాంధీజీ జయంతి రోజున ఆయన విగ్రహానికి పూలమాల వేయడం మాత్రమే కాకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని బాలు నాయక్ అన్నారు. మున్సిపల్ వర్కర్లు పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యం కోసం అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, దూదిపాల వేణుధర్ రెడ్డి, మహమ్మద్ రయీస్, మారుపాకుల సురేష్ గౌడ్, నజీరుద్దీన్, వాంకునావత్ బిక్కు నాయక్, కిన్నెర హరికృష్ణ, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ వర్కర్లు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం అక్కడే.. భవనానికీ భరోసా

-విగ్రహా అభివృద్ధి, భవన నిర్మాణానికి సానుకూలంగా ఎమ్మెల్యే



ఎల్లారెడ్డి, అక్టోబర్ 2, (మహాప్రభ):
ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించాల్సి వచ్చినా, అదే చౌరస్తాలో యథావిధిగా ఏర్పాటు చేసి మరింత అభివృద్ధి చేయాలని అంబేద్కర్ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌తో మాట్లాడి విగ్రహాన్ని అదే ప్రాంతంలో కొనసాగించేలా చర్యలు తీసుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. అలాగే ఎల్లారెడ్డిలో అంబేద్కర్ భవనం మంజూరు చేయాలని కోరగా, భవనం మంజూరుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. తమ సమస్యలను ఓపికగా విని పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యేకు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యాథరి అమృతరావు, బిట్ల సురేందర్, అట్కారి బబ్లు, మేగవత్ కనీరామ్,12వ వార్డు కౌన్సిలర్ ఎరుకల దశరథం, 4వ వార్డు కౌన్సిలర్ హాట్కరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు





అధికారులతో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ సమావేశం నిర్వహించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్

తూప్రాన్, అక్టోబర్,2.(మహా ప్రభ)
కేంద్ర హోంమంత్రి అమిత్ షా అక్టోబర్ 4న మెదక్ జిల్లా బ్రహ్మణపల్లిలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ASL (Advance Security Liaison) అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ సమావేశం నిర్వహించారు. ముందుగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నిర్వహించే అమూల్ మిల్క్ కంపెనీ భూమి పూజ స్థలం, హెలిప్యాడ్, సభా వేదిక ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం పర్యటనకు సంబంధించిన భద్రతా ప్రణాళిక, బందోబస్తు, రూట్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్, జిల్లా పోలీస్ అధికారులు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ, ఆర్‌అండ్‌బీ, ఐఎస్‌డబ్ల్యూ, సీఆర్‌పీఎఫ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. పర్యటన రూట్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ మళ్లింపులు, వీఐపీ రాకపోకలు, అత్యవసర వైద్య సేవలు, రోడ్ల పరిస్థితి తదితర అంశాలపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్/రూట్ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీ రాకపోకలు, ప్రజల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయాలని, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని సూచించారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్య, ఫుడ్ సేఫ్టీ, ఆర్‌అండ్‌బీ, ఐఎస్‌డబ్ల్యూ, సీఆర్‌పీఎఫ్ తదితర శాఖలు తమ పరిధిలోని ఏర్పాట్లను సమయానికి పూర్తి చేసి పోలీస్ శాఖతో సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. శాఖల మధ్య నిరంతర సమాచార మార్పిడి ఉండాలని, పర్యటనకు సంబంధించిన ప్రతి అంశంపై పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.కేంద్ర హోంమంత్రి పర్యటన సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ స్పష్టం చేశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి





దేవరకొండ సెప్టెంబర్ 2 (మహాప్రభ)
దేవరకొండ పట్టణంలోని గాంధీ బజార్ లో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం జర్నలిస్టులు సమస్యలను పరిష్కరించాలని, హక్కుల పరిరక్షణ పెండింగ్ డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా దేవరకొండ లోని జర్నలిస్టులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ బజార్ లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు సమిష్టిగా పాల్గొని తమ డిమాండ్లను ప్రభుత్వం తక్షణం స్పందించి పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం. ఉద్యోగ భద్రత. ఇళ్ల స్థలాలు. హెల్త్ కార్డులు. తదితర సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరారు, ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డివిజన్ అధ్యక్షులు గిరిధర్ రావు డిమాండ్ చేశారు.రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ మద్దతు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వైఎస్ కరుణాకర్. శ్రీపతిరావు. సైదులు. ఇలియాస్. పి ఆర్ ఓ శ్రీను. అంకురి వెంకటయ్య. ఎన్.వి. టి ఆర్యన్. వెంకటయ్య. జోసెఫ్. శ్రీను. తదితరులు పాల్గొన్నారు

సత్యం, అహింసలే సమాజానికి శ్రీరామరక్ష





- వెంకటాయపల్లిలో ఘనంగా మహాత్ముని విగ్రహావిష్కరణ
-గాంధీజీ మార్గం. సర్వజన హితం: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి
- ఆడబిడ్డల ఆశాజ్యోతి 'కల్యాణలక్ష్మి'కి నేడే అంకురార్పణ
- మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

దేవరకద్ర: అక్టోబర్ 2 మహాప్రభ
జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శనీయమని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గాంధీ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలో కురువ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆయన ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అహింసాయుత పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇదే పవిత్ర దినాన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపేలా 'కల్యాణలక్ష్మి' పథకానికి శ్రీకారం చుట్టారని ఆయన గుర్తుచేశారు. ఈ పథకం ద్వారా ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డలు లబ్ధి పొందారని, వారి వివాహాలకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం ఎంతో ఆసరాగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.
కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..
కల్యాణలక్ష్మి పథకం ద్వారా మహిళా సాధికారతకు కృషి చేసిన కేసీఆర్ పట్ల గ్రామస్తులు తమ కృతజ్ఞతను చాటుకున్నారు. వెంకటాయపల్లి గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, వెంకటాయపల్లి మాజీ సర్పంచ్ సక్కరి ఆంజనేయులు, జంగం శేఖర్, వెంకటాయపల్లి కురువ సంఘం నాయకులు శివ, మండల నాయకులు డోకూర్ నరేందర్ రెడ్డి, జట్టి నరసింహారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, కొండ భాస్కర్ రెడ్డి, వడ్డే కొండల్, దొబ్బలి ఆంజనేయులు, పుష్కుల వెంకట్ రాములు, డోకూర్ ఆశన్న, పాండు తదితర కురువ సంఘం పెద్దలు, గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గాంధీజీ కలలుగన్న భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి!!

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి!!



వనపర్తి అక్టోబర్ 2 (మహాప్రభ)
గాంధీ జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.బి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న భారతదేశం అంటే కేవలం స్వాతంత్ర్యం సాధించిన దేశం మాత్రమే కాదని, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, స్వచ్ఛత, గ్రామీణాభివృద్ధి, శాంతి, సౌభ్రాతృత్వం నెలకొన్న భారతదేశమని అన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం మహాత్మా గాంధీ చేసిన త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే గాంధీ జయంతికి నిజమైన నివాళి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, మున్సిపల్ చైర్మన్ మాధవి, ఎస్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, మైనార్టీ సెల్ అధ్యక్షులు అయూబ్ ఖాన్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ డెవలప్ సొసైటీ' ఉచిత శిక్షణా కేంద్రాలు ప్రారంభం!

- గాంధీ జయంతి వేడుకల్లో టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్ 3వ బ్యాచ్‌లు ప్రారంభం

-హాజైన రిటైర్డ్ ఉద్యోగులు, ప్రముఖులు ఆ ఆర్టీఐ ఏయెస్ రాష్ట్ర అధ్యక్షులు డా.,.కొర్ర కిషన్ నాయక్



దేవరకొండ అక్టోబర్ 2 (మహాప్రభ)
జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనే లక్ష్యంగా.. గ్రామీణ యువత మరియు మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేసేందుకు దేవరకొండ పట్టణంలో 'విలేజ్ డెవలప్ సొసైటీ' మరో కీలక ముందడుగు వేసింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం 'విలేజ్ డెవలప్ సొసైటీ' ఆధ్వర్యంలో ఉచిత వృత్తి విద్యా శిక్షణా కేంద్రాల మూడో విడత బ్యాచ్‌లను ఘనంగా ప్రారంభించారు. దీనిలో భాగంగా టైలరింగ్, కంప్యూటర్ మరియు బ్యూటీషియన్ కోర్సుల కొత్త బ్యాచ్‌లు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ హెల్త్ సీహెచ్ఓ ఆర్. గోపాల్ సింగ్, రిటైర్డ్ కండక్టర్ ధరం సింగ్, మరియు ఆర్టీఐ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డా.,.కొర్ర కిషన్ నాయక్,మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి విచ్చేశారు. వారు జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో నిరుద్యోగ యువత, మహిళలు చేతివృత్తులు మరియు సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగడానికి ఇలాంటి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. దేవరకొండ ప్రాంతంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న 'విలేజ్ డెవలప్ సొసైటీ' సంస్థ సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో 'విలేజ్ డెవలప్ సొసైటీ' కోఆర్డినేటర్ భాషా చౌహాన్, నాయకులు టీక్య నాయక్, గోవర్ధన్, ఎన్. శాంతి, కే. కవిత, బి. నిహారిక తదితరులు పాల్గొన్నారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు యువతకు పిలుపునిచ్చారు.

దేవరకొండలో మహాత్మా గాంధీ 157" వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి



దేవరకొండ అక్టోబర్ 2 (మహాప్రభ)
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం ఈరోజు ఉదయం 9 గంటలకు అధ్యక్షుడు ఎన్.వి. టి. సభ్యులు మరియు చిన్నారులతో కలసి గాంధీ పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ (మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ) అక్టోబర్ 2, 1869 న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించారు అని, ఆయన సత్యం అహింస మార్గాలతో భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన జాతిపిత అని, సహాయ నిరాకరణ ఉద్యమం (1920)ఉప్పు సత్యాగ్రహం (దండి యాత్ర - 1930) క్విట్ ఇండియా ఉద్యమం, సత్యం, అహింస, స్వదేశీ వాడకం ఆయన ప్రధాన సిద్ధాంతాలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, ఖ పంతులాల్ నాయక్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, సముద్రాల వెంకన్న, కౌన్సిలర్ ముత్యాల రవి, తాళ్ల సురేష్ ,సన్నీ , మాకం మహేష్, జగదీశ్వరా చారి, వేణు, శ్రీను, కౌన్సిలర్ సాయి, నారాయణ, సైదులు, వల మల్ల ఆంజనేయులు, కరాటే మాస్టర్ గోపి, భాస్కర్ రెడ్డి, శ్రీనయ్య, కౌన్సిలర్ అజయ్ చంద్ర, సత్యం, అనన్య , కృప శ్రీ ,మహిత, అస్మిత్ రాథోడ్, లక్కీ.హర్షవర్ధన్ రాథోడ్,విక్కి, బాబి, శివ, మహేష్. క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు

పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలతో ఘన సన్మానం

దేవరకొండ అక్టోబర్ 2 (మహాప్రభ)
దేవరకొండ, అక్టోబర్ 2: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా దేవరకొండ పట్టణంలోని ఐబీ వద్ద పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ తెలంగాణ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకూరి నరసింహ మాట్లాడుతూ.. సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు. ఎండ, వానను లెక్కచేయకుండా ప్రజారోగ్యం కోసం నిరంతరం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజంలోని ప్రతి వర్గానికి సేవ చేయాలనే సందేశాన్ని అందిస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నక్క వెంకటేష్ యాదవ్, బిజెపి నల్గొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్ది భాస్కర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, నేతల వెంకటేష్ యాదవ్, మండల అధ్యక్షులు రాము నాయక్ చండీశ్వర్, రెడ్డి శంకర్, సముద్రాల సహదేవులు, కసుల శంకరయ్య. గంజి హరి ,జూలూరు శ్రీను, ఎర్ర యాదయ్య, జయరాం, లక్ష్మణ్, వీరేష్,ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయం

-సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛతతో సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

-లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త పిలుపు



తూప్రాన్, అక్టోబర్ 2. (మహాప్రభ)
జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, సేవా మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆదర్శప్రాయమని నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్, తూప్రాన్ లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ మార్గాలను ఆయుధాలుగా చేసుకుని ప్రజలను ఒకే తాటిపైకి తీసుకువచ్చారని తెలిపారు. ఎలాంటి హింసకు తావులేకుండా సత్యం, ధర్మం, అహింస మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి గాంధీజీ ఆశయాలు కేవలం స్వాతంత్ర్య ఉద్యమ కాలానికే పరిమితం కాకుండా ప్రతి తరానికి మార్గదర్శకాలని అన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పడంతో పాటు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

గాంధీజీ మార్గంలో సమాజ సేవకు ముందుకు రావాలి

తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. గాంధీజీ ఆశయాలను కేవలం జయంతి రోజున స్మరించుకోవడం కాకుండా ప్రతిరోజూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, అవసరాల్లో ఉన్నవారికి చేయూతనందించడం ద్వారా గాంధీజీ కలలుగన్న సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడం ద్వారా సమాజంలో మానవతా విలువలను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ జనరల్ లయన్ పల్లెర్ల బాలేష్ గుప్త మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ భారతదేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం ప్రజలను సంఘటితం చేసి, సత్యం, అహింస సిద్ధాంతాలతో ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. అలాంటి మహనీయుడిని స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ దేశ సేవకు, సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
లయన్ మహమ్మద్ హమ్మద్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

గాంధీ జయంతిని సేవా కార్యక్రమాలతో నిర్వహించిన తూప్రాన్ లయన్స్ క్లబ్
64 మంది ఇన్‌పేషెంట్లు, వారి సహాయకులకు, ఔట్‌పేషెంట్లకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వంగ భాస్కర్ రెడ్డి క్యాటరింగ్ ఆధ్వర్యంలో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్ వంగ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుండే తూప్రాన్ లయన్స్ క్లబ్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు చేయూతనందించాలనే ఉద్దేశంతో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్న సుమారు 64 మంది రోగులకు, వారితో పాటు ఉన్న 64 మంది సహాయకులకు, అలాగే ఔట్‌పేషెంట్లకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రోగులకు ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితుల్లో కొంతైనా ఊరట కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

గాంధీజీ చిత్రపటానికి ఘన నివాళులు

అనంతరం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ చిత్రపటానికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్ సింగ్, సుష్మా హాస్పిటల్ వైద్యులు లయన్ డాక్టర్ ప్రదీప్ సింహ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాల్లో సేవ, స్వచ్ఛత, మానవతా విలువలకు ప్రత్యేక స్థానం ఉందని, వాటిని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.
సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలు, రోగులు, అవసరాల్లో ఉన్న వారికి వివిధ సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సభ్యులు తెలిపారు. గాంధీజీ జయంతి సందర్భంగా కూడా సేవా కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా ఆయన ఆశయాలను స్మరించుకోవడంతో పాటు మానవతా సేవకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. ముందుగా తూప్రాన్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అమర్ సింగ్, నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లయన్ పల్లెర్ల రవీందర్ గుప్త, తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్, లయన్స్ క్లబ్ సెక్రటరీ జనరల్ లయన్ పల్లెర్ల బాలేష్ గుప్త, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ ప్రదీప్ సింహ, లయన్ మహమ్మద్ హమ్మద్, లయన్ వంగ భాస్కర్ రెడ్డి, లయన్ నేతి సాగర్ గుప్త, తూప్రాన్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కోవూరు శ్రీనివాస్ గుప్త, కోడిప్యాక లక్ష్మణ్ రావు గుప్త, గబ్బుల సిద్ధిరాములు గుప్త, నేతి బాల వీరయ్య గుప్త, ఉప్పల నర్సింలు గుప్త, ఉప్పల అశోక్ గుప్త, నేతి అశోక్ గుప్త, కోడిప్యాక నాగరాజు గుప్త, కోడిప్యాక చిన్న నారాయణ గుప్త, దేవత శ్రవణ్ కుమార్ గుప్త, కోడిప్యాక టక్కయ్య గుప్త, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు.

జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం సమరశంఖం

-(టియూడబ్ల్యూజే-హెచ్143)ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డు ఉద్యమం

-ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

-ఈజేహెచ్ఎస్ పథకాన్ని పునరుద్ధరించి మెరుగైన వైద్య సేవలు అందించాలి

-జిల్లా కన్వీనర్ సురేందర్ రెడ్డి.



మెదక్ జిల్లా -02అక్టోబర్ (మహాప్రభ,).
జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలని, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టియూడబ్ల్యూజే-హెచ్143) ఆధ్వర్యంలో మెదక్‌లో పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభమైంది. జర్నలిస్టుల ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, గతంలో అమలైన జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని పునరుద్ధరించి, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సంఘం జిల్లా కన్వీనర్ సురేందర్ రెడ్డి, మెదక్ ప్రెస్ క్లబ్ కార్యదర్శి సంగమేశ్వర్ లు డిమాండ్ చేశారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తమ ప్రధాన డిమాండ్లను పోస్ట్‌కార్డులపై రాసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత ప్రభుత్వ బాధ్యతగా గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కోరారు.టియూడబ్ల్యూజే (హెచ్143) మెదక్ జిల్లా కన్వీనర్ పబ్బతి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ నిరంతరం విధులు నిర్వహించే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఈహెచ్ఎస్ స్థానంలో జర్నలిస్టుల కోసం ఈజేహెచ్ఎస్ పథకాన్ని పునరుద్ధరించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఆర్థిక ఇబ్బందులు లేకుండా కార్పొరేట్ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు పొందేలా తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని, ఆరోగ్య భద్రతకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయకూడదని ఆయన కోరారు.టియూడబ్ల్యూజే (హెచ్143) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా చేపడుతున్న ఉద్యమంలో భాగంగానే మెదక్‌లో పోస్ట్‌కార్డు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సురేందర్ రెడ్డి తెలిపారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుత పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు హామీ కల్పించేలా ప్రభుత్వం వెంటనే స్పందించి, హెల్త్ కార్డులు, ఈజేహెచ్ఎస్ పథకం పునరుద్ధరణపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని అయన డిమాండ్ చేశారు.జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం చేపట్టిన ఈ ఉద్యమానికి తమ మద్దతు ప్రకటిస్తూ, ప్రభుత్వం స్పందించే వరకు సంఘటితంగా తమ డిమాండ్లను వినిపిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు బీవీకే రాజు, మన్నే శ్రీనివాస్, గిరి, యాదగిరి, రాఘవులు, ఆంజనేయులు, కార్తీక్, వంశీ, ఉషయ్య, రాద్వ లక్ష్మణ్, శ్రీనివాస్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మంథని-02అక్టోబర్ (మహాప్రభ,).
వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎంవి నాయక్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి డిఎఫ్ఓ ఆదేశాల మేరకు మంథని ఎఫ్ఆర్ఓ నాయక్ ఆధ్వర్యంలో ఖాన్సాయిపేట, బట్టుపల్లి గ్రామాల్లో కార్డాన్ సెర్చ్, రైడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో వన్యప్రాణి వారోత్సవాల పై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. అడవులను నరకడం, వన్య ప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, అటవీ సంపదను కాపాడడం లో ప్రజలు భాగస్వాములు కావాలని ఎఫ్ఆర్ఓ నాయక్ పిలుపునిచ్చారు. అనంతరం శివ్వారం వన్యప్రాణి అభయారణ్యంలో క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఏక్లాస్ పూర్ అటవీ ప్రాంతంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి ఎఫ్ఆర్ఓ సతీష్ కుమార్ మంథని, పెద్దపల్లి రేంజ్ ల డిప్యూటీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు..



గాంధీ జయంతి సందర్భంగా న్యూ పవర్ కుంగ్‌ఫు అకాడమీ అధ్వర్యంలో ఘనంగా నివాళులు



షాద్ నగర్ అక్టోబర్ 2,(మహా ప్రభ)
గాంధీ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణం లోని సత్యనారాయణ టెంపుల్ వద్ద న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ అధ్వర్యంలో కుంగ్ ఫు విద్యార్థులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ సత్యం, అహింసలే ఆయుధాలుగా చరిత్రపై చెరగని ముద్ర వేసిన జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఇవే మా ఘన నివాళులు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజం శాంతి, ఐకమత్యం వైపు సాగాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.

గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్



రామాయంపేట, అక్టోబర్ 2 (మహాప్రభ)
గాంధీజీ ఆశయాలే నేటి తరానికి మార్గదర్శకం – సత్యం, అహింసా మార్గాలను అనుసరించాలి: మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్
సత్యం, అహింసా సిద్ధాంతాలతో దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ అన్నారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రామాయంపేట పట్టణంలోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పల్లె జితేందర్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహింస, సత్యాగ్రహ మార్గంలో మహాత్మా గాంధీజీ సాగించిన పోరాటం ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఎలాంటి హింసకు తావులేకుండా సత్యం, అహింసా సిద్ధాంతాలతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించిన గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గాన్ని నేటి తరం ఆచరించడం ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యత మరింత బలోపేతమవుతాయని అన్నారు. గాంధీజీ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. “గాంధీజీ చూపిన మార్గాన్ని నేటి తరం ఆచరించడం ద్వారా సమాజంలో శాంతి, సోదరభావం, ఐక్యత మరింత బలోపేతమవుతుంది. గాంధీజీ కలలుగన్న సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి.” పల్లె జితేందర్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్, రామాయంపేట కార్యక్రమంలో పాల్గొన్నవారు, బీఆర్ఎస్ నాయకులు, బాదే చంద్రం, మద్దెల రమేష్, ఎస్.కె అహ్మద్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా రామాయంపేటలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు.

దేవరకొండ ఆర్టీసీ డిపో నుండి తిరుపతి బస్సు సౌకర్యం.



దేవరకొండ డివిజన్ అక్టోబర్ 2 (మహాప్రభ)
దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతి సూపర్ లగ్జరీ, రహమతాబాద్, మరియు నాగార్జునసాగర్ డీలక్స్ బస్సు సర్వీసులకు ముందస్తు ఆన్లైన్బుకింగ్సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్విజయ కుమారి తెలిపారు.హైదరాబాద్ (MGBS) నుంచి(వయా మల్లేపల్లి,మాచర్ల) తిరుపతికి శుక్ర,శనివారాల్లో మధ్యాహ్నం 1 గంటకు, తిరుపతి నుంచి (వయా మాచర్ల, మల్లేపల్లి)హైదరాబాద్(MGBS)కు శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 గంటకు బస్సు నడుస్తుందన్నారు. హైదరాబాద్(MGBS) నుంచి (వయా మల్లేపల్లి, మాచర్ల) రహమతాబాద్ కు సాయంత్రం 5 గంటలకు, రహమతాబాద్ నుంచి (వయా మాచర్ల, మల్లేపల్లి) సాయంత్రం 7 గంటలకు డీలక్స్ బస్సు(ప్రతి రోజు), మరియుహైదరాబాద్(MGBS)నుంచి(వయామల్లేపల్లి) నాగార్జున సాగరకు మధ్యాహ్నం 3:50 (ప్రతి రోజు) మరియు నాగార్జునసాగర్ నుంచి (వయా మల్లేపల్లి) హైదరాబాద్(వీ+దీ) కు ఉదయం 5 గంటలకు(ప్రతి రోజు) డీలక్స్ బస్సు నడుస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

గాంధీ జయంతి సందర్భంగా రామాయంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లు



రామాయంపేట అక్టోబర్ 2 మహాప్రభ
గాంధీ జయంతి పురస్కరించుకొని శుక్రవారం రామాయంపేట పట్టణంలోని గాంధీ విగ్రహానికి మున్సిపల్ కౌన్సిలర్లు , కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు, ఇతర పార్టీ నాయకులు , పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

GO నం.25ను పునఃపరిశీలించాలి

-ప్రాథమిక విద్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుల సర్దుబాటు విధానంలో మార్పులు చేయాలి
-మహాత్మా గాంధీ విగ్రహానికి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌కు SGTU వినతి



తూప్రాన్, అక్టోబర్ 2.(మహాప్రభు)
ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన GO నం.25ను పూర్తిగా పునఃపరిశీలించి, అవసరమైతే రద్దు చేయాలని, లేదా ప్రాథమిక విద్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తగిన సవరణలు చేయాలని SGTU మెదక్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. SGTU మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తూప్రాన్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మెదక్ జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌ను కలిసి GO నం.25తో ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యలు, ప్రాథమిక పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా SGTU నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రతి తరగతికి అవసరమైన స్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయుల సర్దుబాటు విధానం వల్ల కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఒకటి కంటే ఎక్కువ తరగతులకు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఒకే ఉపాధ్యాయుడు బహుళ తరగతులను నిర్వహించాల్సి వచ్చినప్పుడు ప్రతి తరగతికి తగిన బోధనా సమయాన్ని కేటాయించడం, విద్యార్థుల వ్యక్తిగత అభ్యసన అవసరాలను గుర్తించడం, తరగతి నిర్వహణ, మూల్యాంకనం, విద్యార్థుల అభ్యసన ఫలితాలపై అవసరమైన శ్రద్ధ చూపడం కష్టతరమవుతుందని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల కేటాయింపులో కేవలం విద్యార్థుల సంఖ్యను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా, పాఠశాలలోని తరగతుల సంఖ్య, విద్యార్థుల అభ్యసన అవసరాలు, పాఠశాల భౌగోళిక పరిస్థితులు, బోధనా భారం, ప్రాథమిక విద్య ప్రత్యేకతలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ప్రాథమిక విద్య విద్యార్థుల భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది వేస్తుందని, అందువల్ల ప్రతి తరగతికి తగిన ఉపాధ్యాయుడు అందుబాటులో ఉండేలా ఉపాధ్యాయుల కేటాయింపు విధానాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.
GO నం.25ను పూర్తిగా పునఃపరిశీలించి అవసరమైతే రద్దు చేయాలని, కొనసాగించాల్సిన పరిస్థితిలో ప్రాథమిక విద్యకు అనుకూలంగా తగిన సవరణలు చేయాలని కోరారు. విద్యార్థుల సంఖ్యతో పాటు తరగతుల సంఖ్యను కూడా ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయులను కేటాయించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు కారణంగా ఏ పాఠశాలలోనూ విద్యార్థుల తరగతి బోధనకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే పాఠశాలల వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహించి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో SGTU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, మెదక్ జిల్లా అధ్యక్షుడు జింక అశోక్, జిల్లా బాధ్యులు సత్యం, రమేష్, యాదగిరి, పిలం, శ్రీధర్, వెంకటేష్, రాజు, రాములు, వెంకట రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల డిమాండ్లు పరిష్కరించాలి

- గాంధీ విగ్రహం ముందు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ‘డిమాండ్స్ డే

రామాయంపేట అక్టోబర్ 2 మహా ప్రభ
దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్లు పరిష్కరించాలని ఐజేయూ పిలుపు మేరకు టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో ‘డిమాండ్స్ డే’ నిరసన చేపట్టి, కలెక్టర్ ఏఓ యూనుస్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు ఎ. శంకర్ దయాళ్ చారి మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ‘పనిచేస్తున్న పాత్రికేయుల డిమాండ్ల దినం’గా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు.
ప్రధాన డిమాండ్లు
సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు , ఈ రంగాన్ని సమగ్రంగా సమీక్షించి, ఆధునిక యుగానికి అనువైన విధాన సిఫార్సులను రూపొందించడానికి కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి.
భద్రతకు ప్రత్యేక కేంద్ర చట్టం , పాత్రికేయులు, మీడియా సంస్థల భద్రత కోసం ప్రత్యేక చట్టం తేవాలి. శారీరక దాడులు, ఏకపక్ష నిర్బంధాలు, ఆన్‌లైన్ వేధింపుల నుండి కాపాడాలి.
పాత చట్టాల పునరుద్ధరణ,1955, 1958 చట్టాల కింద హామీ ఇవ్వబడిన ప్రత్యేక రక్షణలను తక్షణమే పునరుద్ధరించాలి.
కొత్త వేతన మండలి,2007లో చివరిసారిగా వేతన మండలి ఏర్పాటు చేశారు. జీవన వ్యయం, ద్రవ్యోల్బణం పెరిగిన నేపథ్యంలో ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియా సిబ్బందికి న్యాయమైన వేతన సవరణ కోసం కొత్త వేతన మండలి ఏర్పాటు చేయాలి.
రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలు:కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉద్యోగుల మాదిరిగా హెల్త్ కార్డులు, క్యాష్ లెస్ ట్రీట్మెంట్ అందించాలి.
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీ.జి. శ్రీనివాస్ శర్మ, ఐజేయూ సభ్యులు శ్రీనివాస్ మిన్పూర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు బొందుగుల నాగరాజు, ప్రెస్ క్లబ్ కోశాధికారి అశోక్, గౌరవ సలహాదారులు ఫారూక్ హుస్సేన్, శ్రీధర్, హరినాథ్, గౌరవ అధ్యక్షులు కామాటి కృష్ణ, సీనియర్ జర్నలిస్టులు రమేష్ గౌడ్, నగేష్, శివ చరణ్, రాము పటేరి, ప్రకాష్, రామ కృష్ణ గౌడ్, కృష్ణ గౌడ్, రాజశేఖర్, బోనగిరి చంద్రశేఖర్, గోవర్ధన్ రెడ్డి, చింతల రమేష్, ఖయ్యూం, యూసుఫ్ అలీ, సఫ్దర్, హమీద్, నరేందర్, నర్సింహులు, సత్యనారాయణ, బైరవరెడ్డి, రాంచందర్ రెడ్డి, గిరి, శ్రీహరి గౌడ్, కార్తీక్, సాయి, ఆంజనేయులు గౌడ్, సుభాష్, రాఘువులు, జనార్దన్, రఘు, స్వాగత్ రాజు, శ్రీను, అల్లాడి శేఖర్, లక్ష్మి నారాయణ, మురళీధర్, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 6న ఓయూలో జరిగే ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సభను విజయవంతం చేయాలి

-వనపర్తి జిల్లా నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి రావాలి
-హలో విద్యార్థి... చలో ఉస్మానియా యూనివర్సిటీ...
-వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి కొమ్మవారి మస్తాన్ మాదిగ



వనపర్తి అక్టోబర్ (2 మహాప్రభ)
అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థుల జాతీయ ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ కొమ్మవారి మస్తాన్ మాదిగ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో ఎమ్మార్పీఎస్ తాజా మాజీ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఆధ్వర్యంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఎంఎస్పి వనపర్తి జిల్లా తాజా మాజీ అధ్యక్షులు, కో-ఇంచార్జ్ మొలక్కలపల్లి పరుశురాముడు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా ఇంచార్జ్ కొమ్మవారి మస్తాన్ మాదిగ, ఎం ఈ ఎఫ్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ లిగద్వాల కృష్ణయ్య మాదిగ హాజరయ్యారు. విశిష్ట అతిథిగా ఎమ్మెస్ పి, తాజా మాజీ పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షులు, ఎమ్మెస్ ఎఫ్ వనపర్తి జిల్లా కో-ఇంచార్జ్ మీసాల గణేష్ మాదిగ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి అనుబంధంగా ఎమ్మెస్ ఎఫ్ విద్యార్థులను సమీకరించి అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించే విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కూడా విద్యార్థులు సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.
అక్టోబర్ 6న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే ఎమ్మెస్ ఎఫ్ జాతీయ ప్రతినిధుల సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి మాదిగ విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.
వనపర్తి జిల్లాలోని 15 మండలాల నుంచి విద్యార్థులను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ఎమ్మార్పీఎస్ ఇంచార్జీలు, నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, సీనియర్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామానికి ఇద్దరు చొప్పున, ప్రతి మండల కేంద్రం నుంచి కనీసం ఐదుగురు చొప్పున విద్యార్థులను సమీకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు వైట్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ డ్రెస్ కోడ్ పాటించాలని తెలిపారు.
ఈ సమావేశంలో గంధం గట్టయ్య మాదిగ, మీసాల నాగరాజు మాదిగ, పుట్టపాగ అజయ్ కుమార్ మాదిగ, మచ్చ తిరుపతి మాదిగ, చంద్రకాంత్ మాదిగ, ప్రవీణ్ మాదిగ, గౌరీపాగ లక్ష్మణ్ మాదిగ, గంధం రాములు మాదిగ, వెంకట రాములు మాదిగ, వీక్రా సీనియర్ నాయకులు బచ్చలకూర పరమేష్ మాదిగ, రాజానగరం రాజేష్ మాదిగతో పాటు MSF నాయకులు దినేష్, తేజ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడికి దేవరకద్ర ఘన నివాళి

-స్ఫూర్తిదాయకంగా 157వ గాంధీ జయంతి వేడుకలు
-మున్సిపల్ కార్యాలయం, కోర్టు ప్రాంగణంలో బాపూజీకి పుష్పాంజలి
-వేడుకల్లో పాల్గొన్న వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు
-పండుగ వాతావరణంలో గాంధేయవాద స్మరణ





దేవరకద్ర: అక్టోబర్ 2 మహా ప్రభ దేవరకద్ర
అహింస, సత్యమే ఆయుధాలుగా.. చెక్కుచెదరని సంకల్పంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన జాతిపిత మహాత్మా గాంధీకి దేవరకద్ర పట్టణం ఘనంగా నివాళులర్పించింది. మహాత్ముడి 157వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసింది. అధికారుల నుంచి సామాన్యుల వరకు ప్రతి ఒక్కరూ బాపూజీ సేవలను, త్యాగాలను స్మరించుకుంటూ భక్తిశ్రద్ధలతో ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. దేవరకద్ర మున్సిపాలిటీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను అధికారికంగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని మహాత్ముడి చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కోర్టు ప్రాంగణంలో కొలువుదీరిన గాంధీజీ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలతో అలంకరించి ఘనంగా అశ్రు నివాళి అర్పించారు. దేశ పునర్నిర్మాణంలో గాంధీజీ చూపిన మార్గం, గ్రామాభివృద్ధే లక్ష్యంగా ఆయన కన్న కలలను ఈ సందర్భంగా వక్తలు గుర్తుచేసుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి పాల్గొని మహాత్ముడికి నివాళులర్పించారు. గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన అడుగుజాడల్లో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వైస్ చైర్మన్ తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది, పలువురు పట్టణ ప్రముఖులు చురుగ్గా పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పౌర సమాజం పెద్ద ఎత్తున హాజరై జాతిపిత పట్ల తమకున్న అపారమైన గౌరవాన్ని చాటుకున్నారు. ప్రజలు, అధికారుల సమన్వయంతో సాగిన ఈ కార్యక్రమం స్థానికుల్లో జాతీయ భావాన్ని, అహింసా స్ఫూర్తిని రగిలించింది.

30 నెలల్లో దాదాపు రూ. 100 కోట్ల సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓ సి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ!!

- సహాయం కాదు ఇది ఎమ్మెల్యేగా నా బాధ్యత
--రూ. 3459 కోట్ల అభివృద్ధి పనులు
--భజ్యాతి రాష్ట్ర సమితి టిఆర్ఎస్ హయాంలో సంక్షోభం
-- నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం



వనపర్తి అక్టోబర్ 2 !(మహాప్రభ)
కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 30 నెలల్లో వనపర్తి నియోజకవర్గం లో దాదాపు 100 కోట్లకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓ సి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సి ఏం ఆర్ ఎఫ్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు
అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...
వనపర్తి నియోజకవర్గం లోని ప్రతి కుటుంబానికి తాను ఒక పెద్ద కొడుకులా పనిచేస్తున్నానని నేను చేసే ప్రతి పని వారికి సహాయం కాదని ఎమ్మెల్యేగా తన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు
గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ క్యాంపు కార్యాలయంలోకి ఏ ఒక్కరిని అనుమతించేవారు కాదని నేడు ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరూ సమానంగా క్యాంపు కార్యాలయం కార్యాకాల పళ్ళు పాల్గొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతుయన్నారు ఆర్టీసీల్లో ప్రయాణించే మహిళలకు ప్రభుత్వం తరపున ఇప్పటివరకు 12 వేలకోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని ఆయన తెలిపారు 200 యూనిట్ ఉంచి విద్యుత్ కోసం 6000 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు వనపర్తి నియోజకవర్గంలోనే 32,000 మందికి రేషన్ కార్డు అందించి వారికి సన్న బియ్యం చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనని ఎమ్మెల్యే అన్నారు విద్యాభివృద్ధి కోసం 600 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతుయన్నారు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిస్ చార్జీలు పెంచిందని, పాఠశాల దుస్తుల పంపిణీలో పుస్తకాల పంపిణీలోఎలాంటి ఇబ్బందులేకుండా ముందస్తుగానే పంపిణీ చేపట్టిందన్నారు 500 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, లాంటి ఉన్నత విద్యపై ప్రభుత్వం దృష్టి సారించి తెలంగాణ రాష్ట్రాన్ని విద్యాభివృద్ధిలో దేశంలోనే ముందుంచేందుకు చర్యలు చేపట్టిందన్నారు నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, రుణమాఫీ రైతు భరోసా రైతు బీమా లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రైతుకు వెన్ను దన్నుగా నిలుస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు దుస్తుల కుట్టడం, సోలార్ ప్లాంట్ లో ఏర్పాటు, ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సమైక్యలకు ఆర్టీసీ బస్సులు కొనుగోలులో భాగస్వామ్యం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అమలుపరుస్తోందన్నారు గత ప్రభుత్వం కేవలం రోడ్ల వెంట లైట్లు వేసుకుంటూ డివైడర్లు నిర్మించుకుంటూ చెరువు కట్టలపై రివిట్మెంట్ కట్టి అందిన కాడికి కమిషన్లు దండుకొని పోయిందని నిరుపేద ప్రజలకు ఏమి చేయలేదని ఎమ్మెల్యే విమర్శించారు ఎల్లినో ప్రపంచమంతా ఇబ్బందులు ఎదుర్కొంటుందని దాని ప్రభావంతో ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రత్యేక కమిటీ ద్వారా చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు గత ప్రభుత్వం చేసిన అప్పులను కడుతూనే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చి ఇచ్చిన హామీల్లో భాగంగా మిగిలిపోయిన మూడు హామీలను సైతం త్వరలోనే అమలుపరుస్తుందన్నారు
బజ్యాతి రాష్ట్ర సమితి గురించి కెసిఆర్ కూతురు కవిత కెసిఆర్ చుట్టూ దొంగలు చేరారని గుంటనక్క హరీష్ రావు, పొట్టోడు కేటీఆర్ లు పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేశారని అలాంటివారిని ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని చెప్పడం విశేషమని ఎమ్మెల్యే అన్నారు కాంట్రాక్టర్ గా చేసుకుంటూ, వ్యవసాయం చేసుకుంటూ పాలముకుంటూ కూలివాడిలాగా పనిచేసుకుంటే తప్పు కాదని కబ్జాలు చేస్తూ కమిషన్లు మింగుతూ ప్రజలను మోసం చేస్తే తప్పని కొందరు సన్యాసులు తనను కూలోడని మాట్లాడడం పై ఎమ్మెల్యే విమర్శించారు కొల్లాపూర్ లో తన్ని తరిమేస్తే తెలంగాణ సెంటిమెంటును అడ్డుపెట్టుకొని విద్యార్థుల శవాలపై రాజకీయం చేసి అధికారుల్లోకి వచ్చిన మోసగాళ్లు ఒకేసారి ఎమ్మెల్యేగాయి వేళ్ళ కోట్లు దండుకుంటే ప్రజలు తన్ని తరిమేశారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు కేంద్రంలో ఖార్గే ని, రాష్ట్రంలో స్పీకర్ ని దళితులని అవమానించి పసుపు నీళ్లతో శుద్ధి చేసే దొరల పాలన కాకుండా నేడు రేవంత్ రెడ్డి ప్రజా పాలన నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు 240 కోట్ల రూపాయలతో త్వరలోనే వనపర్తిలో ఇండస్ట్రియల్ సంబంధించిన సెక్టార్ ప్రారంభమవుతుందని నిరుద్యోగులకు ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని ఎమ్మెల్యే తెలిపారు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలతో నిరుపేదల సొంత ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొని గృహప్రవేశాలు చేపట్టే ప్రతి ఇంటికి పెద్ద కొడుకునై వారికి సారే చీర అందించి వారి దీవెనలు పొందుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందుతే మేఘన అభయస్థలం ద్వారా అందించే 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని నేను బ్రతికున్నంత వరకు కొనసాగిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు భజ్యాతి రాష్ట్ర సమితి పార్టీ రాకముందే కాంగ్రెస్ పార్టీ అనేక ప్రాజెక్టులు నిర్మించి లక్షలాది ఎకరాల సాగునీరు అందించిన ఘనత ఉందన్నారు అది మరచి నేడు కట్టిన కాలువలకు బొక్కలు పెట్టిన నాయకులు తామేదో నీళ్లు తెచ్చినట్లు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు కారు పార్టీకి కారుకున్న టైర్లు ఊడిపోయాయి అని, స్టీరింగ్ పాడైపోయిందని, బాడీ బయటికి వెళ్ళలేని పరిస్థితిలో ఉందని ఇలాంటి పరిస్థితుల్లో కారు రోడ్డుకు రావడం కష్టమేనని హాస్యాస్పదంగా విమర్శించారు ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆయన సీఎంఆర్ఎఫ్ కళ్యాణలక్ష్మి షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు కార్యక్రమంలో వనపర్తి ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, అన్ని మండలాల ఎమ్మార్వోలు, మున్సిపల్ చైర్మన్ మాధవి ఎస్ ఎల్ ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, ఘణపురం పెద్దమందడి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు, నవనీత క్యామ రాజు వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, గోపాల్పేట ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ అధ్యక్షులు వెంకటేష్, ఉపాధ్యక్షులు సత్యశీలారెడ్డి, పండి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ పెద్దలు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బి.ఆర్.ఎస్ నివాళులు



వనపర్తి అక్టోబర్ 2 (మహాప్రభ)
మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా,పట్టణ అధ్యక్షులు గట్టు యాదవ్,వాకిటి. శ్రీధర్ పలుస.రమేష్ గౌడ్ మాట్లాడుతూ సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్రం సాధించిన జాతిపిత మహాత్మా గాంధీ అని అన్నారు. అహింసా,శాంతి,స్వచ్ఛత, గ్రామస్వరాజ్యం ఆశయాల కోసం జీవితాంతం గాంధీ పరితపించారని వారి ఆశయాల అనుగుణంగా తెలంగాణ జాతిపిత కె.సి.ఆర్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యం సాధించారని కొనియాడారు. మహాత్మా గాంధీ ఆశయాలు ఆచరించడం మన బాధ్యత వారి ఆశయ సాధనకు కృషిచెద్దామని పిలుపునిచ్చారు. నివాళులు అర్పించిన వారిలో బి.లక్ష్మయ్య,గంధం.పరంజ్యోతి నీలస్వామి, ఎర్ర శ్రీను మురళి సాగర్, మెకానిక్ శ్రీను అక్రమ్, రమేష్ గౌడ్, పెండెం నాగన్న ఉంగ్లం తిరుమల్, జాత్రు నాయక్, జోహెబ్, చిట్యాల రాము, ఇమ్రాన్ జానంపేట శ్రీను, సూర్యవంశం గిరి నందిమల్ల రమేష్ఆవుల రమేష్,అస్లాం స్టార్ రహీం, శంకర్ గౌడ్, సూర్య వంశం ముని కుమార్, సిరిగిరి మన్యం సుగూరు శ్రీను, డేగ మహేశ్వర్ రెడ్డి, ఆరిఫ్, ఖాదర్, రమేష్ నాయక్ రాజు నాయక్, ఉండేకోటి శివ, వహీద్ ఖాదర్ల సుగూరు వెంకటేష్ తోట శ్రీను తదితరులు ఉన్నారు. గంధం పరంజ్యోతి బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వనపర్తి టౌన్ (మాజీ)

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

-అంగన్వాడీ కేంద్రంలో లబాన్ మహిళల ఆధ్వర్యంలో నిర్వహణ



గాంధారి: అక్టోబర్ 02(మహాప్రభ)
మండల కేంద్రంలోని తిప్పారం తండా గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో గాంధీ జయంతి వేడుకలను లబాన్ మహిళలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బిషలన్ లాల్ మాట్లాడుతూ.. గాంధీజీ దేశం కోసం బ్రిటిష్ వారితో 30 సంవత్సరాలు అలుపెరుగని పోరాటం చేసి స్వాతంత్రం సాధించారని కొనియాడారు. సత్యం, అహింస, శాంతి మార్గంలో అనేక పోరాటాలు చేసి భారతదేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చారని, ఆయన మార్గంలోనే గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల్లో విద్య, వైద్యం, పరిశుభ్రత పాటిస్తేనే దేశం బాగుపడుతుందని గంగారం సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శారద, చంద్రీబాయ్, భారతి, సుందరీబాయ్, తాన్ సింగ్, రామ్ చంద్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గంగాధర్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి.



మెదక్ జిల్లా -02అక్టోబర్ (మహాప్రభ).
మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలోనే రాందాస్ చౌరస్తాలో గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతిరాజు మాట్లాడుతూ శాంతి మార్గంతో దేశ స్వాతంత్ర ని సాధించిన గొప్ప మహనీయుడు మహాత్మా.. . గాంధీ అని కొనియాడారు. వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటికి సమాజానికి మార్గదర్శకంగా ఉన్నాయని కొనియాడారు. పట్టణ పార్టీ అధ్యక్షులు మందు గులా గంగాధర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర పోరాటంలో ఉప్పు సత్యాగ్రహం శాంతియుత పోరాటాలతో దేశ స్వాతంత్రానికి మార్గం చూపిన మహనీయుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు గాంధీ ఆశయాలను దేశ యువత ఆచరణలో ఉంచాలని ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు,వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ , పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందు గుల గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్ మున్సిపల్ కౌన్సిలర్లు అవారి రాజశేఖర్, తొడుపునూరి శివరామకృష్ణ , గౌస్ ఖురేషి, కో ఆప్షన్ సభ్యులు శ్రీమతి రాగి వనజ , శ్రీమతి అనూష , కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టాల విశ్వం , కొండ శీను చిన్నారుల ప్రవీణ్ , ప్రవీణ్ గౌడ్, దేవుల నాయక్, పురం వెంకటేష్, శ్రీహమతి మహేశ్వరి,పెళ్లికొట్టాల నాగరాజు, గాడి రమేష్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా గాంధీ జయంతి

వనపర్తి అక్టోబర్ 2 (మహాప్రభ)
జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఈరోజు వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ కూడలిలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ
భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ అహింస సత్యాగ్రహం సత్యం స్వదేశీ స్వావలంబన వంటి సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఇచ్చారని చంపారన్ సత్యాగ్రహం, ఖేడా సత్యాగ్రహం, అహ్మదాబాద్ మిల్లు కార్మికుల ఉద్యమం, అసహకార ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం/దండి యాత్ర, క్విట్ ఇండియా ఉద్యమం వంటి ముఖ్యమైన ఉద్యమాలతో ఆయన భారత స్వాతంత్ర పోరాటాన్ని నడిపించారని పేర్కొన్నారు.



అంతర్జాతీయంగా అక్టోబర్ 2ను అంతర్జాతీయ అహింసా దినోత్సవం గా ఐక్యరాజ్యసమితి పాటిస్తోందనిగాంధీజీ జీవితం మనకు సత్యం, అహింస, శాంతి, సేవ, పరిశుభ్రత, సామాజిక బాధ్యత వంటి విలువలను గుర్తుచేస్తుందని, ఆయన ఆలోచనల్లోని అహింసా సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలపై ప్రభావం చూపిందని మహాత్మా గాంధీ ఆశయాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం తూచా తప్పకుండా పాటిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు డి నారాయణ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్ జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు బచ్చు రాము వాణిజ్యసలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాషే శీను జిల్లా కన్వీనర్ బంకలి సుబ్రమణ్యం కౌన్సిలర్ విజయసాగర్ నాయకులు సూగూరు రాములు ఎండి ఖలీల్ రాయనసాగర్ తిరుపతయ్య యాదవ్ చిన్న రాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ ఆశయ సాధనే అందరి లక్ష్యం





-వెంకటయ్యపల్లిలో ఘనంగా మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ
-కురుమ సంఘం ఆధ్వర్యంలో ఉత్సాహంగా వేడుకలు
-పల్లె ప్రగతే ధ్యేయంగా విజయవంతమైన గ్రామసభ
-పాల్గొన్న సర్పంచ్ చక్కరి రామాంజనేయులు, ప్రజాప్రతినిధులు

దేవరకద్ర (వెంకటయ్యపల్లి): అక్టోబర్ 2 మహాప్రభ
గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా, సత్యం, అహింసల మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకోవాలని గ్రామ సర్పంచ్ చక్కరి రామాంజనేయులు పిలుపునిచ్చారు. దేవరకద్ర మండల పరిధిలోని వెంకటయ్యపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్ముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్.. గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో కురుమ సంఘం పెద్దల చొరవతో బాపూజీ విగ్రహాన్ని నెలకొల్పడం హర్షణీయమన్నారు. గాంధీజీ చూపిన శాంతి మార్గం నేటి యువతకు ఆదర్శమని, ఆయన కలలుగన్న ఆదర్శ గ్రామంగా వెంకటయ్యపల్లిని తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఉద్బోధించారు.
ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామసభ..
విగ్రహావిష్కరణ అనంతరం సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన గ్రామంలో గ్రామసభను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సభలో పల్లె ప్రగతి, గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య మెరుగుదల, తాగునీటి సరఫరా తదితర కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామస్తులు తమ సమస్యలను నేరుగా సభ దృష్టికి తీసుకురాగా.. వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. పారదర్శక పాలన అందిస్తూ, ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ చేరువ చేస్తామని స్పష్టం చేశారు. ఈ జాతీయ పండుగ వేడుకలతో పాటు గ్రామసభలో ఉప సర్పంచ్ మోహన్, కురుమ సంఘం పెద్దలు శివ సాయిలు, పెద్ద కురువ రాములు, వార్డు సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

‘హనుమాన్ అంశ’ తెలుగు రిలీజ్ డేట్ ఫిక్స్!



కేవలం రూ. 1.8 కోట్ల చిన్న బడ్జెట్‌తో తెరకెక్కి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్రం ‘హనుమాన్ అంశ్’. ఈ సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అనౌన్స్‌మెంట్ అయితే చేశారు కానీ ఇప్పటివరకు ఎటువంటి అప్‌డేట్ లేదు. అయితే తాజాగా ఈ సినిమా విడుదలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది.ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్ ఈ చిత్రాన్ని తెలుగులో అక్టోబర్ 9న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి ఈ సినిమా తెలుగు వెర్షన్ సెప్టెంబర్ 18నే విడుదల కావాల్సి ఉంది. అయితే త్రివిక్రమ్ శ్రీనాథ్ తన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్ ద్వారా ఈ రిలీజ్ నుండి తప్పుకోవడం, హైదరాబాద్‌లో జరగాల్సిన తెలుగు టీజర్ లాంచ్ ఈవెంట్ రద్దు కావడంతో ఈ సినిమా తెలుగు విడుదల కొద్ది రోజులు వాయిదా పడింది. తాజాగా హోంబలే ఫిలింస్ రంగంలోకి దిగి తెలుగు రిలీజ్ బాధ్యతలను తీసుకుంది. విశాల్ చతుర్వేది దర్శకత్వంలో నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా ఆధ్యాత్మిక డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం, ఇప్పటికే రూ. 400 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించింది. శోభినావ్ సత్య నేమ్ కరోలి బాబా పాత్రలో నటించిన ఈ డివైన్ డ్రామా అక్టోబర్ 9న తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

‘ఆరుగురు పతివ్రతలు’ రీ-రిలీజ్!

22 ఏళ్ల తర్వాత మళ్లీ థియేటర్లలోకి..



దివంగత దర్శకుడు ఈ.వి.వి. సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన చిత్రం “ఆరుగురు పతివ్రతలు”. అప్పట్లో వివాహ వ్యవస్థ, దాంపత్య జీవితంలోని సంక్లిష్టతలు, ఈగోలు మరియు కుటుంబ బంధాల నేపథ్యంలో సాగిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఓ సరికొత్త సంచలనం సృష్టించింది. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడంతో పాటు ఆలోచింపజేసిన ఈ చిత్రం, ఇప్పుడు సరికొత్త హంగులతో మరోసారి థియేటర్లలో అలరించేందుకు సిద్ధమవుతోంది.ఈ సినిమాను అక్టోబర్ 29న అత్యంత వైభవంగా గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో పాత క్లాసిక్ సినిమాలను 4k మరియు మెరుగైన సాంకేతిక హంగులతో రీ-రిలీజ్ చేసే ట్రెండ్ జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వస్తున్న ఈ కల్ట్ ఫ్యామిలీ అండ్ బోల్డ్ ఎంటర్‌టైనర్ యూత్ ని, ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఒకేలా ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రం తొలిసారిగా 2004 ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సాధించింది. సరిగ్గా ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు సరికొత్త డిజిటల్ టెక్నాలజీతో నేటి తరానికి సరికొత్త వినోదాన్ని పంచేందుకు రీ-ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమా ప్రత్యేకత ఏమిటంటే, దర్శకుడు ఈవీవీ ఈ చిత్రం ద్వారా దాదాపు 42 మంది కొత్త నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేశారు. వారితో పాటు ప్రముఖ నటులు ఎల్.బి. శ్రీరామ్, చలపతిరావు తదితరులు కీలక పాత్రల్లో నటించి తమ నటనతో అలరించారు. మరి ఇన్నేళ్ల తర్వాత థియేటర్లలో రీ-ఎంట్రీ ఇస్తున్న ఈ కల్ట్ కామెడీ-డ్రామా మూవీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సందడి సృష్టిస్తుందో వేచి చూడాల్సిందే!

హాలీవుడ్ రేంజ్‌లో ఎన్టీఆర్ ‘డ్రాగన్’..

- గూస్‌బంప్స్ తెప్పించే మూడు యాక్షన్ బ్లాక్స్!



టాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం ‘డ్రాగన్’. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ప్రశాంత్ నీల్ సినిమాలంటేనే విజువల్ వండర్స్, ఎమోషనల్ డెప్త్ మరియు గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ ఎపిసోడ్స్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. అయితే ఈసారి ‘డ్రాగన్’ కోసం నీల్ ఆ అంచనాలకు మించి రెట్టింపు స్థాయిలో యాక్షన్ ప్లాన్ చేసినట్లు సమాచారం.కేవలం సాధారణ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లా కాకుండా, హాలీవుడ్ స్థాయి సాంకేతిక విలువలతో విజువల్ విందుగా ఈ చిత్రాన్ని మలచడానికి చిత్ర యూనిట్ చాలా శ్రమిస్తోంది. ముఖ్యంగా సినిమాలో ప్రత్యేకంగా డిజైన్ చేసిన మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ ఈ చిత్రానికి ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. ప్రతి ఫైట్ సీక్వెన్స్‌కు బలమైన భావోద్వేగ నేపథ్యం ఉండేలా ప్రశాంత్ నీల్ ఈ సన్నివేశాలను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. సినిమా ప్రారంభంలో వచ్చే జైల్ ఫైట్ గురించి ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తోంది. అత్యంత క్లిష్టమైన సెట్టింగుల మధ్య, భారీ హంగులతో తెరకెక్కించిన ఈ సీక్వెన్స్ ప్రేక్షకులను సీట్లలో కదలకుండా కట్టిపడేయడం ఖాయమని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక చిత్రంలోనే అత్యంత శక్తివంతమైన ఎపిసోడ్‌గా కాళీమాత ప్రాంగణం ఫైట్ నిలవబోతోంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్స్, ఆర్ట్ డిపార్ట్‌మెంట్ సృష్టించిన మ్యాజిక్ ఈ ఫైట్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లనున్నాయి. కాళీమాత ప్రాంగణం నేపథ్యంలో వచ్చే ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ మాస్ అండ్ రౌద్ర రూపం థియేటర్లలో ప్రేక్షకులకు పూనకాలు తెప్పించడం పక్కా. అలాగే ఈ మూడు యాక్షన్ బ్లాక్స్‌లో అత్యంత క్రూరమైన మరియు భావోద్వేగంతో కూడిన బ్లడ్ ఫైట్ ఎపిసోడ్ సినిమాకే అసలైన హైలైట్‌గా నిలవబోతున్నట్లు సమాచారం. ఇది సాధారణ పోరాటంలా కాకుండా ఒక సర్వైవల్ వార్ లా సాగుతుంది. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో రక్తపుటేరులు పారేలా, ప్రతి ఫ్రేమ్‌లోనూ ఇంటెన్సిటీ మిస్ కాకుండా దీన్ని రూపొందించారు. ఈ మూడు భారీ యాక్షన్ బ్లాక్‌లు సినిమా రన్టైమ్‌లో కీలక మలుపులుగా నిలుస్తూ, కథను పరుగులు పెట్టించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని సమాచారం. వెండితెరపై ఈ విజువల్ వండర్‌ను చూస్తున్నప్పుడు ప్రేక్షకులు మైమరచిపోవడం ఖాయమనే మాట బాక్సాఫీస్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది.

‘ధర్మన్’లో స్పెషల్ రోల్

ఈ సోషల్ మీడియా యుగంలో దేన్నీ దాచలేం. ఎంత గోప్యంగా ఉంచినా.. ఏదో విధంగా అది బయటకు వచ్చేస్తుంటుంది. రజనీకాంత్ ‘ధర్మన్’ సినిమాకు సంబంధించిన పలు అసక్తికరమైన విషయాలు ఇటీవల మీడియా ద్వారా బయటకొచ్చాయి. రామ్ పోతినేని ఇందులో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్ర పోషిస్తున్నారని, ఆయనకు జోడీగా రాశీఖన్నా నటిస్తున్నారని, ఆమెది రజనీకాంత్ కూతురి పాత్ర అని, రజనీ, రామ్‌ల మధ్య సన్నివేశాలు నువ్వానేనా అనేలా ఉంటాయని తెలిసింది.తాజాగా తెలుగమ్మాయి శ్రీలీల కూడా ఇందులో భాగమైనట్టు సమాచారం. ప్రస్తుతం మైసూర్‌లో ‘ధర్మన్’ షూటింగ్ జరుగుతున్నది. ఆ లొకేషన్‌లో సంప్రదాయబద్ధమైన లంగా, ఓణీలో సడెన్‌గా దర్శనమిచ్చారు శ్రీలీల. దాంతో ఎవరో రహస్య కెమెరాలతో ఆమెను క్లిక్ మనిపించారు. ఆ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. అయితే.. ఇందులో శ్రీలీల పోషించే పాత్ర ఏంటి? అనేది తెలియాల్సివుంది.



బాక్సాఫీస్ వద్ద దసరా పోరు.. ‘ది ప్యారడైజ్’ బాటలో ‘రణబాలి’!



సినిమా రంగంలో బాక్సాఫీస్ లెక్కలు ఎప్పుడూ మారుతాయన్న సంగతి తెలిసిందే. ఒక సినిమా సాధించిన విజయాలు లేదా రికార్డులు తదుపరి సినిమాలకు ఒక బెంచ్‌మార్క్‌గా మారుతుంటాయి. తాజాగా నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన ‘ది ప్యారడైజ్’ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌లను నమోదు చేసి సంచలనం సృష్టించింది. ఈ సినిమాకు ఒక వైపు నుంచి మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, కేవలం నాలుగు రోజుల్లోనే ఈ సినిమా రూ. 155 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు యూనిట్ వర్గాలు వెల్లడించాయి. ఇక నాని కెరీర్‌లో ఇటువంటి భారీ వసూళ్లు సాధించడం ఆయన స్టార్‌డమ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లినట్లు ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు.ఈ నేపథ్యంలో అదే బాక్సాఫీస్ సెంటిమెంట్‌ను రిపీట్ చేయడానికి టాలీవుడ్ మరో భారీ చిత్రంతో సిద్ధమవుతోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘రణబాలి’. స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో, ఆ కాలంలోని కరువు పరిస్థితుల సృష్టితో పాటు ఒక సరికొత్త ఆత్మకథాత్మక లేదా మిస్టరీ అంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం అత్యంత భారీ ఎత్తున విడుదలకు ముస్తాబవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్లు, డాక్యుమెంటరీ సిరీస్ వీడియోలు మరియు పోస్టర్లు ఈ సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. ‘ది ప్యారడైజ్’ సినిమాకు ఏ విధంగానైతే బలమైన పాజిటివ్ బజ్ క్రియేట్ అయిందో, ‘రణబాలి’ విషయంలోనూ మేకర్స్ అదే వ్యూహంతో విజయవంతమయ్యారు. ఈ చిత్ర దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ గత చిత్రాలైన ‘టాక్సీవాలా’, ‘శ్యామ్ సింగరాయ్’ విభిన్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించాయి. ఆయన నుంచి వస్తున్న మరో పీరియాడికల్ డ్రామాపై భారీ అంచనాలు ఉండటంలో ఆశ్చర్యం లేదు. మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట తెరపై కనిపించనుండటం, ముఖ్యంగా వీరిద్దరి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు నుంచి ‘యూ/ఏ’ (ఖ/ఖా) సర్టిఫికెట్ లభిస్తే, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా పెద్ద ఎత్తున థియేటర్లకు క్యూ కట్టే అవకాశం ఉంది. దసరా సెలవుల జోరుతో ‘రణబాలి’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి. ఇక త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌తో ప్రస్తుత హైప్ మరింత రెట్టింపు కావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com